RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 264 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | శుక్రవారం, ఏప్రిల్,17, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 264 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Friday, April, 17, 2026 | PAGES : 8 RS : 4 /- |



## కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### 8 మంది భక్తుల మృతి

**కర్నూలు ,తెలంగాణ దిశ :** కర్నూలు జిల్లా మంత్రాలయం మండలంలో ఈరోజు తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీ రాఘవేంద్ర స్వామి వారి దర్శనానికి వెళుతున్న భక్తుల వాహనం ప్రమాదానికి గురవడంతో 8 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 12 మంది గాయపడ్డారు. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. కర్ణాటకలోని చిక్‌మంగళూరుకు చెందిన కొందరు భక్తులు బొలెరో వాహనంలో మంత్రాలయం బయలుదేరారు. వీరి వాహనం చిలకలడోన గ్రామ సమీపానికి రాగానే, ఎదురుగా వస్తున్న రెడీమిక్స్ లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు బొలెరో వాహనం నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.



## సమగ్ర కుటుంబ సర్వే వివరాల విడుదల

- రాష్ట్ర జనాభా గణాంకాల్లో బీసీల ఆధిక్యం
- బీసీ వర్గాల్లో ముదిరాజ్‌లకు అగ్రస్థానం
- రెండో స్థానంలో యాదవ, గొల్ల వర్గాలు
- 1,12,36,849 కుటుంబాల సర్వే పూర్తి
- 97.10 శాతం కుటుంబాల డేటా సేకరణ

*హైదరాబాద్,తెలంగాణ దిశ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. బుధవారం రాత్రి మంత్రు లు సర్వేకు సంబధించిన పూర్తి వివరాలను విడుదల చేశారు. ఇవి ప్రజలకు అందుబాటులో ఉండేలా https:// des.telangana.gov.in అనే వెబ్‌సైట్ లోనూ పొందుపర్చారు. ఇక సర్వేలోని వివరాలు చూసుకుంటే..రాష్ట్రవ్యాప్తంగా కోటి 12 లక్షల 36 వేల 849 కుటుంబాలను (97.10) సమగ్ర సర్వే చేసి మొత్తం 3 కోట్ల 55 లక్షల 50 వేల 759 మంది జనాభా వివరాలను ప్రభుత్వం సేకరించింది. ప్రభుత్వ కులగణన లెక్కల ప్రకారం రాష్ట్రం జనాభాలో అత్యధిక శాతం బీసీలు ఉన్నట్టు తెలుస్తోంది.*

వివిధ సామాజిక వర్గాల జనాభా వివరాలు చూసుకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జనాభాలో బీసీలు–56.36 శాతం మంది ఉండగా, ఎస్సీలు–17.42శాతం, ఎస్టీలు– 10. 43 శాతం,ఓబీసీలు - 15.79 శాతం మంది ఉన్నారు. ఇక కులం లేదని చెప్పిన వారు 4 శాతం ఉన్నట్టు అధికారులు తెలిపారు. అయితే సమగ్ర కులగణన సర్వే లెక్కల ప్రకారం బీసీ కులాలలో టాప్ 20 జనాభా ఉన్న సామాజిక వర్గాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. బీసీల లో ముదిరాజ్ సామాజికవర్గం 7.4 శాతం జనాభాతో మొదటి స్థానంలో ఉండగా, 0.2 శాతం జనాభాతో మేదరి సామాజికవర్గం 20వ స్థానంలో ఉంది. ఇక అత్యధికజనాభా ఉన్న టాప్ 20 కులాల ఏవని చూసుకు ంటే. బీసీల్లో ముదిరాజ్‌లే ఎక్కువ ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 26 లక్షల 39 వేల మంది అంటే దీజ జనాభాలో 7.4శాతం ముదిరాజ్‌లు ఉన్నారు.



## నిప్పుల కొలిమిలా.. తెలుగు రాష్ట్రాలు

- రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత
- భానుడి భగభగలతో ఇంటికే పరిమితం అయిన జనం

హైదరాబాద్,తెలంగాణ దిశ : ఎండల తీవ్రతతో తెలుగు రాష్ట్రాలు నిప్పుల కొలిమిగా మారాయి. గత నెల రోజులుగా ఆయా ప్రాంతాల్లో విభిన్న వాతావరణం చోటు చేసుకుంది. కొన్నిచోట్ల అకాల వర్షాలు, పలుచోట్ల వడగళ్ల వర్షం, చూసాం. ఇప్పుడు ఉన్న ట్టుండి వడగాడ్పులు చప్పుడు వింటున్నాం. భానుడి భగభగలతో జనం మిట్ట మధ్యాహ్నం బయటకు వెళ్ళ లేక ఉన్న చోటనే ఇంట్లోనో, కార్యాలయంలోనో ఉండిపోతున్నారు.

- రష్యా, ఇరాన్ చమురుపై ఆంక్షల మినహాయింపులను పొడిగించేది లేదన్న అమెరికా
- ఈ వెసులుబాటుతో భారీగా చమురు కొనుగోలు చేసిన భారత్‌పై ప్రభావం
- ఏడేళ్ల తర్వాత తొలిసారిగా ఇరాన్ నుంచి భారత్‌కు చేరిన ముడి చమురు




## రష్యా, ఇరాన్ చమురుపై.. అమెరికా కీలక నిర్ణయం

### భారత్‌కు కొత్త సవాళ్లు

ఢిల్లీ,: రష్యా, ఇరాన్‌ల నుంచి ముడి చమురు కొనుగోలు చేసేందుకు తాత్కాలికం గా ఇచ్చిన ఆంక్షల మినహాయింపులను పొడిగించేది లేదని అమెరికా స్పష్టం చేసింది. ఈ వెసులుబాటును సద్వినియోగం చేసుకుని భారత్ భారీగా చము రును దిగుమతి చేసుకున్న నేపథ్యంలో అమెరికా తాజా నిర్ణయం దేశీయ ఇం ధన రంగంపై ప్రత్యక్ష ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇరాన్‌పై తిరిగి "గరిష్ఠ ఒ త్తిడి" విధానాన్ని అమలు చేయడంలో భాగంగానే ఈ కఠిన నిర్ణయాన్ని తీసుకు న్నట్లు తెలుస్తోంది. అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ మాట్లాడుతూ... "రష్యా, ఇరాన్ చమురుకు సంబంధించిన జనరల్ లైసెన్స్‌ను మేము పునరుద్ధ రించడం లేదు. మార్చి 11వ తేదీకి ముందే నౌకల్లోకి ఎక్కించిన చమురుకు మాత్రమే ఇది వర్తించింది. ఆ ప్రక్రియ ఇప్పటికే ముగిసింది" అని తెలిపారు. పశ్చి మాసియాలో ఉద్రిక్తతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా పెరిగిన ఇంధన ధరలను నియం త్రించేందుకు ట్రంప్ ప్రభుత్వం ఈ తాత్కాలిక మినహాయింపులు ఇచ్చింది.

## ప్రజాస్వామ్య చరిత్రలో.. సరికొత్త అధ్యాయం

### మహిళలకు నిర్ణయాధికారం ఉండాలనేదే మా లక్ష్యం ప్రధాని మోదీ

ఢిల్లీ,: నారీ శక్తికి పెద్దపీట వేస్తూ, భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లి ఖించబో తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. భారత రాజకీయ యవనికపై ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. మహిళా రిజర్వే షన్ల కోసం ఉద్దేశించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు (నారీ శక్తి వందన్ అభియాన్)పై లోక్‌సభలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రసంగం చేశారు.





## మహిళా బిల్లుతో ఏ రాష్ట్రానికి నష్టం లేదు

### ఈ బిల్లుతో మహిళలకు లోక్‌సభలో 272 సీట్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్16 : మహిళా రిజర్వేషన్ల అమలుతో ఏ రాష్ట్రానికి గానీ, పురుషులకు గానీ ఎలాంటి నష్టం జరగదని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ స్పష్టం చేశారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల కు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు వీలుగా కేంద్రం 3 కీలక బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అనంతరం వీటిపై చర్చ ప్రారంభించగా.. కేంద్రమంత్రి మేఘ్‌వాల్ ప్రసంగించారు.

ఈ బిల్లులతో లోక్‌సభలో మహిళలకు 272 సీట్లు లభిస్తాయని అన్నారు. పార్లమెంట్ చరిత్రలో ఇది సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు. మహిళా రిజర్వేషన్లను అమలుచేయాల్సిన సమయం వచ్చింది. కొన్ని బిల్లులను భావితరాలు మరువలేవు. ఆర్టికల్ 368 ద్వారా ప్రజాహిత నిర్ణయాలను తీసుకునేందుకు పార్లమెంట్‌కు రాజ్యాంగం శక్తినిచ్చింది. ఈ క్రమంలోనే మూడు కీలక బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టాం. లోక్‌సభ స్థానాలను 50శాతానికి పెంచేందుకు వీటిని తీసుకొచ్చాం.

**కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్ అభ్యంతరం**
**కులగణన లేకుండా చేపట్టడంలో తొందరెందుకున్న అఖిలేశ్**
**విపక్షాల అభ్యంతరాలను తోసిపుచ్చిన అమిత్ షా**



## 2024లోనే ఎందుకు అమలు చేయలేదు

న్యూఢిల్లీ,ఏప్రిల్16 : చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజక వర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు కేంద్ర ప్రభుత్వం 3 బిల్లులను లోక్‌సభ ముందుకు తీసుకొచ్చింది. ఈ సందర్భంగా విపక్షాలు తమ అభ్యంతరాలను లేవనెత్తగా.. వాటిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తోసిపుచ్చారు. 2024లో మహిళా రిజర్వేన్లను ఎందుకు అమలు చేయలేదని లోక్‌సభలో బిల్లులు ప్రవేశపెట్టడానికి ముందు జరిగిన చర్చ సందర్భంగా కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. 2023లోనే ఆ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇచ్చామన్నారు.రాజ్యాంగాన్ని ప్రభుత్వం హైజాక్ చేస్తోందన్నారు. దీనిపై అమిత్‌షా స్పందిస్తూ.. బిల్లు ప్రవేశపెట్టకుండానే ఎలా ప్రశ్నిస్తారని అసహనం వ్యక్తంచేశారు.

## ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచిపెట్టే బిల్లు

**మహిళా బిల్లుపై ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ అక్కసు**

న్యూఢిల్లీ,ఏప్రిల్16 : పార్లమెంట్ సమావేశాల్లో మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టారు. మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గ పునర్విభజన బిల్లుపై కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ చర్చను ప్రారంభించారు. అయితే.. మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఏఐఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యతిరేకించారు. మహిళా బిల్లుకు నిరసనగా సాహిర్ లుధియాన్వి రాసిన ఓ కవితను లోక్‌సభా ముఖంగా చదివి వ్యతిరేకించారు. ఈ బిల్లు సమాఖ్య వాద ఉల్లంఘన కిందకు వస్తుందని అసదుద్దీన్ ఒవైసీ పేర్కొంటూ.. దీనిని సభలో ప్రవేశపెట్టడాన్ని తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని అన్నారు. ఈ చర్చ మహిళా రిజర్వేషన్‌కు సంబంధించినది కాదని, ఇది ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచివేసే చర్య అని ఆయన అభిప్రాయపడ్డారు. జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్రకు ఈ బిల్లు మరింత అధికారాన్ని ఇస్తుందని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అరికడుతుందని ఒవైసీ వాదించారు.

## తెలంగాణపై వ్యతిరేకత బీజేపీకి నరనరాన నిండి ఉంది

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై భారతీ య జనతా పార్టీ నాయకులు మరో సారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై గౌరవం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్ప డటాన్ని భారత్–పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకార పూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. బీజేపీ నాయకులు పదే పదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవా న్ని, అమర వీరుల త్యాగాలను అవ మానించడం అలవాటుగా మార్చు కున్నారని ఆయన మండిపడ్డారు.



### తేజస్వి సూర్యపై కేటీఆర్ ఫైర్

### రాజ్ బహదూర్ వెంకట్రాంరెడ్డి విగ్రహానికి లేని ఆంక్షలు...

# మహనీయుల విగ్రహాలకు ఎందుకు..!?

- బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి
- మహనీయుల విగ్రహాల తొలగింపును నిరసిస్తూ ధర్నా
- ఉద్రిక్తంగా మారిన మహనీయుల విగ్రహాల తొలగింపు
- ఆందోళన కారులను ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ కు తరలింపు





**చర్లపల్లి, ఏప్రిల్ 16, (తెలంగాణ దిశ) :** చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి చౌరస్తాలో మహనీయుల విగ్రహాలను తొలగించడంతో తీవ్ర ఉద్రిక్తత దారితీసింది. పెద్ద చర్లపల్లిలో ఏర్పాటు చేసిన విగ్రహాలను తొలగించిన గుర్తు తెలియని వ్యక్తులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని, యధా స్థానంలో విగ్రహాలను ప్రతిష్టించాలని కోరుతూ గురువారం స్థానికులు, దళిత సంఘాల నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, పలు పార్టీలకు చెందిన నాయకులు నిరసన తెలియజేస్తూ ఆందోళన చేపట్టారు. దీంతో చర్లపల్లి ఇన్ స్పెక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో స్థానికంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆందోళనకారులను అరెస్టు చేసి ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి... పెద్ద చర్లపల్లి చౌరస్తాలో ఈ నెల 13వ తేదీన డాక్టర్ బిఆర్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను



స్థానికులు, దళిత సంఘాల ప్రతినిధులు ఏర్పాటు చేసి ఈ నెల 14వ తేదీన అంబేద్కర్ జయంతి సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున విగ్రహాలను తొలగిస్తూ దిమ్మెను ధ్వంసం చేయడంతో ఆందోళనకారులు నిరసనకు దిగారు. బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో దళిత సంఘాలు, వివిధ సంఘాల నాయకులు కార్యకర్తలు పోలీసుల వైఖరిని నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో పోలీసులు సోమశేఖర్ రెడ్డితో సహా 20 మందిని అరెస్టు చేసి ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ రాజ్ బహదూర్ వెంకట్రాంరెడ్డి విగ్రహానికి లేని ఆంక్షలు మహనీయుల విగ్రహాలకు ఎందుకని ప్రశ్నించారు. అగ్ర కులానికి చెందిన ముఖ్యమంత్రికి దళితుల ప్రతినిధి అయిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పై చిన్నచూపు ఎందుకని ప్రశ్నించారు. మహనీయుల విగ్రహాలను తొలగించడం



అన్యాయమని అన్నారు. విగ్రహాలను ఏర్పాటు చేసే వరకు లేదన్నారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఘట్కేసర్ పోలీసులు అరెస్టు చేసిన వారిలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి తో పాటు బిఆర్ఎస్ చర్లపల్లి డివిజన్ అధ్యక్షులు నేమురి మహేష్ గౌడ్, డప్పు గిరిబాబు, కొమ్ము నర్సింగ్ రావు, కడియాల సురేష్, కేవీఎల్ఎన్ రావు, కొమ్ము సురేష్, కడియాల నాగేష్, కడియాల అనిల్ కుమార్, కొమ్ము రమేష్, బొజ్జ పవన్, ఎడ్ల సోమయ్య, పొన్నాల సురేష్, కొమ్ము శివరాజ్, విజయరాజ్ తదితరులు అరెస్టు అయ్యారు. అరెస్ట్ అయిన వారిని హెచ్ బి కాలనీ మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి యాదవ్, కొత్త రామారావు, జర్రిపోతుల ప్రభుదాస్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయి జన్ శేఖర్, పార్టీ ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి, నాయకులు ఎస్ కె రహీమ్, లంబు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పోలీస్ స్టేషన్ లో పరామర్శించారు.

**విగ్రహాల తొలగింపుపై ఎమ్మెల్యే ఆందోళన**

చర్లపల్లి బస్టాండ్‌లో మహనీయుల విగ్రహాల తొలగింపు ఘటనపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు రోజుల క్రితం ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను బుధవారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తొలగించడం పట్ల ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ చర్యను తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యే, బాధ్యులను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, ఐపీఎస్‌ను కోరారు. మహనీయుల విగ్రహాలను తొలగించడం సమాజానికి అవమానకరమని పేర్కొంటూ, వాటిని తక్షణమే పునఃప్రతిష్ట చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విగ్రహాలను తిరిగి ఏర్పాటు చేసే వరకు విశ్రాంతి తీసుకోబోమని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ ఘటనకు సంబంధించి అరెస్టు అయిన వారిని పోలీస్ ఉన్నతాధికారులతో చర్చించి విడుదల చేయించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.




**చర్లపల్లి సిఐ సుధాకర్ ఫిర్యాదు చేసిన నాయకులు**

పెద్ద చర్లపల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలను గురువారం తెల్లవారుజామున తొలగించిన వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ వివిధ పార్టీల నాయకులు, దళిత సంఘాల నాయకులు చర్లపల్లి ఇన్ స్పెక్టర్ సుధాకర్ కు ఫిర్యాదు చేశారు.

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లిన నాయకులు**

పెద్ద చర్లపల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలు తొలగింపు సరికాదని, విగ్రహాలు తొలగించిన వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి మంత్రి శ్రీధర్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విగ్రహాల తొలగింపు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, విగ్రహాలు తొలగింపు విషయంలో ఆందోళన చేపట్టిన వారిని విడుదల చేయాలని కోరామని వారు తెలిపారు.

## ఒక శాతం తగ్గిన నాన్‌వెజ్ థాలి..

### యథాతథంగా వెజ్ థాలి ధర



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** గడిచిన ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంతో పోల్చితే ఈ ఏడాది నాలుగో త్రైమాసికంలో నాన్‌వెజ్ థాలి ధర 1 శాతం తగ్గింది. అదే సమయంలో వెజ్ థాలి ధర మాత్రం యథాతథం గా ఉంది. ఈ విషయాన్ని క్రిసిల్ రిపోర్టు వెల్లడించింది. క్రిసిల్ రిపోర్టు ప్రకారం.. గత ఏడాది నాలుగో త్రైమాసికంతో పోల్చితే ఈ ఏడాది నాలుగో త్రైమాసికంలో బ్రాయిలర్ చికెన్ ధర రెండు శాతం తగ్గడం.. ఉల్లిగడ్డ, ఆలుగడ్డ ధరలు కూడా గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది తక్కువగా ఉండటం నాన్ వెజ్ థాలి ధర తగ్గడానికి కారణమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇక గత ఏడాది కంటే ఈ ఏడాది ఉల్లిగడ్డ, ఆలుగడ్డ ధర తక్కువగా ఉన్నప్పటికీ.. టమాటా ధరల్లో పెరుగుదల కనపించిందని, అదేవిధంగా గ్యాస్ ధరలు, వంట నూనె ధరలు పెరిగాయని, దాంతో వెజ్ థాలీ ధరలు పెరగకుండా, తగ్గకుండా స్థిరంగా ఉన్నాయని క్రిసిల్ పేర్కొన్నది. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాదికూరగాయల ధరలు 33శాతం పెరిగాయని తెలిపిం ది. 2025 మార్చిలో సగటున కిలో కూరగాయల ధరలు రూ.21 ఉండగా.. ఇప్పుడు అది రూ.28కి చేరిందని పేర్కొన్నది.

# ఏళ్ల తరబడి ఒకేచోట..

**నల్గోండ,,తెలంగాణ దిశ :** నల్లగొండ జిల్లా పోలీస్ శాఖలో కొందరు అధికారులు ఏళ్ల తరబడి పాగా వేశారు. ఇల్లరికం వచ్చిన అల్లుడి తరహాలో తిష్ట వేసి అధికారులతో అంటకాగుతూ అక్రమ దందాలకు తెరలేపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒంటిమీద డ్రెస్ వేయకుండా విధులు నిర్వహించే ఉద్యోగులైన ఇంటిలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్, విజిలె న్స్‌లో ఏళ్ల తరబడి కొందరు పాతుకపోయారు.ప్రతి అంశాన్ని ప్రభుత్వానికి, జిల్లా స్థాయి లో ఉన్నత అధికారులకు నివేదిక అందిస్తారు. క్షేత్రస్థాయి నుంచి జిల్లా స్థాయి అధికా రుల పనితీరుపైన ప్రభుత్వానికి రిపోర్ట్ చే యాల్సి ఉంటుంది. కానీ కొందరు అధికారులు తప్పు చేస్తే వారితో అంటకాగి నివేదిక లు పం పించకుండా ఏమీ తెలియనట్టుగా ఉంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఒంటి మీద ఖాకి డ్రెస్ లేకుండా ప్రత్యేక విభాగాల్లో విధులు నిర్వహిస్తూ ఏళ్ల తరబడి ఉన్న పరిచయాలను నెలవారీ వసూళ్లకు నిదర్శనంగా నిలుస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖాకీ డ్రెస్ లేకుండా పనిచేసే కీలక విభాగాల్లో ఐదేళ్ల వరకు మాత్రమే విధులు నిర్వహించవచ్చు. ఐదేళ్లకు మించి తిష్ట వేయడం అనేక అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.అధికారుల్ని ప్రసన్నం చేసుకుంటూ రాజకీయ నాయకులు పైరవీలతో ఇక్కడే తిష్ట వేసినట్లు తెలుస్తుంది. కానిస్టేబుల్ నుంచి సీఐ స్థాయి అధికారుల వరకు ఉన్నారని ఆ శాఖలోనే చర్చించుకుంటున్నారు. పిడిఎస్ బియ్యం, ఇసుక దందా అధిక వడ్డీ ఆశ చూపడం, పశువుల అక్రమ రవాణా, పేకాటలపై ప్రభుత్వానికి, జిల్లా అధికారులకు నివేదిక ఇవ్వాల్సి ఉంది.అక్రమార్కులతో ఈ శాఖలో తిష్టవేసిన అధికారులు సన్నిహిత సంబంధాలు కొనసాగి స్తూ ఆర్థిక బంధాన్ని బలపరుచుకుంటున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అవినీతి ఆరోపణలు వచ్చిన కానిస్టే బుళ్లను నిఘా విభాగాల్లో తీసుకోకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ అవి కేవలం చెప్పుకుందుకే అనే విధంగా ఉన్నతాధికారుల తీరు ఉన్నట్లు తెలుస్తుంది. దేవరకొండ డివిజన్‌కు చెందిన ఒక కానిస్టేబుల్ గతంలో సస్పెండ్ అయినప్పటికీ అతడిని నిఘా విభాగంలో కొనసాగించడం గమనార్హం. అదే డివిజన్‌లో పనిచేస్తున్న మరో నిఘా విభాగానికి చెందిన అధికారి మద్యం తాగి బైక్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మరణించాడు. సస్పెన్షన్ ఉత్తర్వులు ఇచ్చిన అధికారులు.. సంబంధిత అధికారికి ఆర్డర్ కాపీ ఇవ్వకుండానే మధ్యలోనే నిలిపివేయ డం అంతర్గతంగా పెద్ద చర్చకు దారి తీసింది.అదే డివిజన్‌లో పనిచేస్తున్న ఓ పోలీసు అధికారి పశువుల అక్రమ రవాణాల్లో పట్టుబ డిన వారి నుంచి సదరు పోలీసు అధికారి ఫోన్ పే ద్వారా డబ్బులు తీసుకోగా ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తానని చెప్పడంతో డబ్బులు తీసుకున్న అధికారి నిఘా విభాగం అధికారికి నగదు ఇచ్చినట్లు తెలిసింది. నల్లగొండ డివిజన్‌లో జాతీయ రహదారి సమీపంలోని ఒక పోలీస్ స్టేషన్ వద్ద ఏపీ నుంచి హైదరాబాద్‌కి వెళ్తున్న పశువుల అక్రమ రవాణాపై పోలీస్ తరహాలో కేసులు పెట్టి పట్టుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అయితే అందులోని కొన్ని పశువులను మాత్రమే గోశాలకు తరలించగా పట్టుకున్న పశువులకి, గోశాలకు తరలించిన వాటికి మధ్యన లెక్క పొంతనలేదని పెద్ద ఎత్తున చర్చ జరిగింది. అలాగే రెండు ఇసుక లారీలను పట్టుకొని ఒక లారీ ఓనర్ వద్ద డబ్బులు తీసుకొని వదిలేసినట్లు తెలుస్తుం ది.ఇలాంటి నివేదికలు ఇవ్వకుండా డివిజన్ స్థాయిలో ఉన్నతాధికారి నిఘా విభాగం అధికారులను ప్రభావితం చేస్తున్నారని ఆ శాఖ నుండే వినిపిస్తుంది. ఒక పోలీస్ అధికారి వేధింపులతో ఓ వ్యక్తి ఆత్మహత్య ప్రయ త్నం చేయగా దేవరకొండ డివిజన్‌లో ప్రభు త్వ ఆసుపత్రిలో చికిత్స పొందగా ఈ సంఘటనకు సంబంధించిన విషయం బయటకు తెలియకుండా సంబంధిత అధికారి డబ్బులిచ్చి రాజీ చేసుకున్న విషయం బహిరంగ రహస్యమే.పోలీస్ స్టేషన్‌లో రైటర్లుగా కొనసాగుతూ వచ్చిన ప్రతి అధికారిని ప్రస న్నం చేసుకుంటూ ఆర్థిక ప్రయోజనాలను చక్కదిద్దుతూ ఏళ్ల తరబడి డిప్యూటేషన్ పేరిట కొనసాగడం చర్చనీయాంశంగా మారుతుంది. వీళ్లు లేకపోతే స్టేషన్ నిర్వహణ కష్టమని స్టేషన్ అధికారులతో ఉన్నత అధికారులకు చెప్పించడం, రాజకీయ పలుకుబడి ఉపయోగించడంతో గత 15 నుంచి- 20 ఏళ్ల వరకు ఇక్కడే తిష్ట వేశారు. వారే కుటుం బ సభ్యులతో రియల్ ఎస్టేట్, వడ్డీ వ్యాపారాలను నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది.జిల్లా కేంద్రంలో ఒంటిమీద ఖాకీ డ్రెస్ లేకుండా పనిచేసే ఒక అధికారిపై అతని ఇంటి వద్దనే ఓ మహిళ భర్త బంధువులు దేహశుద్ధి చేయ గా జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో చికిత్స పొం దిన విషయం హాట్ టాపిక్‌గా మారిం ది. అతని వ్యవహార శైలి తెలిసిన ఉన్నత అధికారులు కూడా ఏమీ తెలియనట్టుగా ఉండి అక్క డే కొనసాగించడంలో ఆర్థిక బంధం బలంగా ఉందని గుసగుసలు స్థానికంగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ఎస్సైగా పనిచేసిన అధికారి సర్కిల్, డివిజన్ స్థాయి అధికారిగా ఇదే జిల్లాలో పనిచేస్తూ అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలున్నాయి. తన సామాజిక వర్గానికి చెందిన అధికారులను వెనుకేసుకురావడం, అక్రమాలకు సహకరించని కిందిస్థాయి అధికారులపై రాజకీయ నాయకుల వద్ద ఇతనితో ప్రయోజనం లేదుంటూ చెప్పి అతని పోస్టింగ్ మార్పించడంలో దిట్ట అని ఆ శాఖలో చర్చించుకుంటు న్నారు.

# సంపాదకీయం

## రాష్ట్రాల్లో చట్టంగా మారుతున్న యూసీసీ

దేశవ్యాప్తంగా పలు రాష్ట్ర అసెంబ్లీలు యూనిఫాం సివిల్ కోడ్ బిల్లుకు వరుసగా ఇప్పుడు అది చట్టంగా మారనుంది. ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) అవసరంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారు.ఒకే కుటుంబంలో ఇద్దరికి భిన్నమైన నిబంధనలు వర్తించకూడదు. అసలు ఒకే ఇంట్లో రెండు విధానాలు ఎలా సాధ్యం?" అని ప్రధాని మోదీ ప్రశ్నించారు. ఒకవేళ ఒకే ఇంట్లోని కుటుంబంలో ఇద్దరు వ్యక్తులకు రెండు రకాల చట్టాలుంటే, ఆ ఇల్లు నడవదు" అని అన్నారు.చట్టం కూడా సమానత్వం గురించే మాట్లాడుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని మోదీ అన్నారు.ఈ బిల్లు మహిళలకు ప్రయోజనకరమని ప్రజావేదికల పైనా, మీడియాతోనూ, శాసనసభలోనూ మంత్రులు పదేపదే చెబుతున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందాక, గుజరాత్‌లో మహిళల స్థితిగతులు, లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌ల గురించి కూడా చర్చ మొదలైంది.ఈ బిల్లు వల్ల మహిళలకు పెద్దగా ప్రయోజనం ఉండదని, పైగా సామాజిక సమస్యలు పెరుగుతాయని కొందరు నిపుణుల అభిప్రాయం. మరోవైపు, అణగారిన వర్గాల మహిళలకు ఈ బిల్లు వల్ల మేలు జరుగుతుందని మరికొందరు అంటున్నారు.యూనిఫాం సివిల్ కోడ్ బిల్లులో మహిళల కోసం ఉన్న ముఖ్యమైన నిబంధనలు ఏమిటి, వారికి ఎలాంటి కొత్త హక్కులు కల్పించబోతున్నారు?నిపుణులు ఏమంటున్నారు?ప్రతి మహిళకు వారసత్వ ఆస్తిలో సమాన వాటా లభిస్తుంది. మతం ఆధారంగా మహిళల కోసం ఎటువంటి ప్రత్యేక నిబంధనలు ఉండవుసామాజిక సంప్రదాయాల ప్రకారం ఇచ్చే విడాకులు కాకుండా, కోర్టు ద్వారా మంజూరయ్యే విడాకులు మాత్రమే చెల్లుబాటు అవుతాయి.వివాహం ప్రతి మతంలో వారి ఆచారాల ప్రకారం చేసుకోవచ్చు, కానీ వివాహం రిజిస్ట్రేషన్ చేయించుకోవడం తప్పనిసరి.లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉన్న మహిళను భాగస్వామి వదిలేస్తే, ఆమెకు భరణం పొందే హక్కు ఉంటుంది, వారికి పుట్టిన బిడ్డకు వారసత్వ హక్కులు లభిస్తాయి.వారసత్వ ఆస్తికి సంబంధించి ఎటువంటి వీలునామా రాయకపోతే స్థిరాస్తులు, చరాస్తులలో మహిళకు సమాన హక్కు లభిస్తుంది.ఏ మతంవారైనా సరే ఒక భార్య ఉండగా రెండో వివాహం చేసుకోకూడదనే నియమం తీసుకొచ్చారు.భర్త విడిచిపెట్టిన మహిళలకు న్యాయం చేసే అంశం కూడా ఈ బిల్లులో ఉంది.కోర్టు ద్వారానే కచ్చితంగా విడాకులు తీసుకోవాలనే నిబంధన గురించి రిటైర్డ్ జడ్జి జ్యోత్స్నా యాజ్ఞిక్ మాట్లాడారు."యూనిఫాం సివిల్ కోడ్‌లో సామాజిక పద్ధతుల్లో ఇచ్చే విడాకులను అంగీకరించే బదులు, కోర్టు ద్వారానే విడాకులు తీసుకోవడం తప్పనిసరి చేశారు. అయితే ప్రస్తుత పరిస్థితిని గమనిస్తే, ఫ్యామిలీ కోర్టులలో ఇప్పటికే విడాకుల కేసులు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. అటువంటప్పుడు రాబోయే రోజుల్లో విడాకుల కేసుల భారం మరింత పెరుగుతుంది" అన్నారు యాజ్ఞిక్."ప్రస్తుతం చాలా కులాల్లో సామాజిక పద్ధతుల్లో జరిగే విడాకులు ఇకపై చెల్లకుండా పోతాయి. దీనివల్ల ఫ్యామిలీ కోర్టుల్లో కేసుల పరిష్కారానికి ఎక్కువ సమయం పడుతుంది. కొన్ని కేసుల్లో తక్కువ వయసున్న అమ్మాయిలు లేదా అబ్బాయిల విడాకుల పిటిషన్లు సరైనవే అయినప్పటికీ, ఇటువంటి పరిస్థితుల్లో కేసులు సుదీర్ఘకాలం కొనసాగుతాయి. దీనివల్ల విడాకుల తర్వాత తిరిగి వివాహం చేసుకునే అవకాశం చాలామందికి తగ్గిపోతుంది" అని జ్యోత్స్నా యాజ్ఞిక్ చెప్పారు."చాలా సమాజాలలో 'లేఖణి', 'సాటాపాటా' వంటి ఆచారాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇటువంటి సంప్రదాయ పద్ధతుల ద్వారా జరిగే విడాకుల ప్రక్రియ దుర్వినియోగమవుతున్నట్లు 2021 చివరిలో గుజరాత్ హైకోర్టులో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ నానావతి ధర్మాసనం గుర్తించింది. అయినప్పటికీ, నేటికీ ఈ పద్ధతులు కొనసాగుతున్నాయి. తక్కువ చదువుకున్నవారు, ఆత్మగౌరవం కోసం విడాకులు తీసుకునే మహిళలు ఈ పద్ధతుల ద్వారా విడాకులు పొందినా స్వల్ప కాలంలోనే మరో వివాహం చేసుకోగలుగుతున్నారు. ఇప్పుడు కోర్టులలో ఇటువంటి కేసుల భారం పెరిగి, న్యాయమూర్తుల సంఖ్య తక్కువగా ఉంటే, కొన్ని కులాలకు చెందిన మహిళలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది'' అని ఆమె అభిప్రాయపడ్డారు."మహిళలకు అత్యంత ప్రమాదకరమైన నిబంధన ఏదైనా ఉందంటే, అది లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌కు గుర్తింపునివ్వడమే. ఈ సంబంధాలను రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి చేశారు. గతంలో లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉండేవారు సమాజానికి భయపడేవారు. కానీ ఇప్పుడు బహిరంగంగా, చట్టబద్ధంగా ఇటువంటి సంబంధాల్లో ఉండవచ్చు. కొత్త తరంలో లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లకు ఈ విధంగా గుర్తింపు లభిస్తే, సమాజాన్ని ఏకంగా ఉంచే వివాహ వ్యవస్థ బలహీనపడిపోతుంది. ఇది రాబోయే రోజుల్లో ప్రమాదకరం" అని న్యాయవాది పూజా ప్రజాపతి అభిప్రాయపడ్డారు"లివ్-ఇన్ రిలేషన్‌షిప్ ద్వారా జన్మించిన బిడ్డకు కూడా హక్కులు కల్పించే అంశం ఈ చట్టంలో ఉంది. ఈ సంబంధాల వల్ల కలిగే పిల్లల విషయంలో స్త్రీ, పురుషుల మధ్య కొత్త చట్టపరమైన వివాదాలు తలెత్తుతాయి. లివ్-ఇన్‌లో ఉన్న మహిళపై ఆరోపణలు వస్తే, కొత్త గొడవలు మొదలయ్యే అవకాశం ఉంది. దీనివల్ల మహిళలకు ఎక్కువ నష్టం కలగవచ్చు. అంతేకాకుండా, 18 నుంచి 21 ఏళ్ల లోపు యువతీ యువకులు లివ్-ఇన్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాలనే నిబంధన ఉంది. దీనివల్ల కొత్త సామాజిక సంఘర్షణలు మొదలవుతాయి. ఈ యూనిఫాం సివిల్ కోడ్ వల్ల దీర్ఘకాలంలో ప్రయోజనం కంటే వివాహ వ్యవస్థకే ముప్పు పొంచి ఉంది" అని చెప్పారు.యూనిఫాం సివిల్ కోడ్ ద్వారా విడాకుల కేసుల్లో మహిళలకు తక్షణమే భరణం అందడం, వివాహం జరిగిన ఏడాది తర్వాతే విడాకుల కేసు దాఖలు చేయాలనే నిబంధనలు మంచి పరిణామాలే. అయితే, మహిళలకు దీనివల్ల ఏవో పెద్దఎత్తున ప్రయోజనాలు కలుగుతాయని మాత్రం అనిపించడం లేదు" అని పూజా ప్రజాపతి అన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



### - జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఉమా గౌరీ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 16, (తెలంగాణ దిశ)**జిల్లాలోని వైద్యాధికారులు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ ఉమా గౌరీ స్పష్టం చేశారు. గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ ఉమాగౌరి నేతృత్వంలో జిల్లాలోని డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారులు, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లతో నెలవారీ సమీక్ష సమావేశం జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా మాతృ ఆరోగ్యం, పోషణ, కుటుంబ నియంత్రణ, టీకా కార్యక్రమాలు, సంక్రమణ, అ సంక్రమణ వ్యాధులు, వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతి, సిబ్బంది వివరాలు మరియు ఖాళీలు, ఔషధాల నిల్వలు, బ్యాంక్ ఖాతాల నిర్వహణ, పెండింగ్ బిల్లులు, కాయకల్ప కార్యక్రమం తదితర అంశాలపై సంబంధిత ప్రోగ్రామ్ అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఉమాగౌరి మాట్లాడుతూ అన్ని వైద్యాధికారులు తప్పనిసరిగా ఏబిహెచ్ఏ అటెండెన్స్‌ను సమయానికి నమోదు చేసి సంబంధిత గ్రూపుల్లో పోస్ట్ చేయాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో అవసరమైన ప్రాథమిక మందులు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, గడువు సమీపంలో ఉన్న మందుల కోసం ప్రత్యేక కార్నర్ ఏర్పాటు చేయాలని, గడువు ముగిసిన మందులను నిబంధనల ప్రకారం డిస్ పోజ్ చేయాలని ఆదేశించారు. ప్రతి పిహెచ్ సీ యుపిహెచ్ సీలో అప్డేటెడ్ ఈడిడి క్యాలెండర్‌ను ప్రదర్శించడంతో పాటు చిన్నపిల్లల టీకా కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. గర్భిణీ స్త్రీల సేవల్లో, ముఖ్యంగా రక్తహీనత, హైరిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రసవ సేవలను సమర్థంగా నిర్వహించడం ద్వారా మాతృ మరణాలను నివారించాలన్నారు. టీబీ, ఎన్ సీడిలకు సంబంధించిన రోజువారీ సేవలను నిర్లక్ష్యం చేయకుండా, ప్రతి ఆరోగ్య కేంద్రం కనీస ప్రమాణాలు పాటిస్తూ అవసరమైన పరికరాలు, మందులు అందుబాటులో ఉంచాలని, అవసరమైతే జిల్లా అధికారులను సంప్రదించాలని సూచించారు. అలాగే జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల వివరాల కోసం సర్వే నిర్వహించి, ఒక నెలలోపు నివేదికను డిఎంహెచ్ఓ కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. ఈసమావేశంలో ప్రోగ్రామ్ అధికారులు డా. శ్రీదేవి, డా. గీతా, డా. చంద్రకళ, డా. లావణ్య, డా. కౌశిక్, డిప్యూటీ డెమో వసంత కుమారి, జిల్లా క్వాలిటీ మేనేజర్ సురేష్, జిల్లాలోని వైద్యాధికారులు పాల్గొన్నారు.

# కీసరలో అక్రమ షెడ్డు నిర్మాణం...!?

## చోద్యం చూస్తున్న అధికారులు





**కీసర,ఏప్రిల్ 16, (తెలంగాణ దిశ) :**కీసర సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు విస్తృతంగా జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఔటర్ రింగ్ రోడ్ పరిసర ప్రాంతాలు అనుమతి లేని నిర్మాణాలకు కేంద్రంగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చీర్యాల ప్రధాన చౌరస్తా నుండి కీసర పోలీస్ స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా భారీ షెడ్డు నిర్మాణం చేపట్టడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇంటి నిర్మాణ అనుమతులు తీసుకుని,వాటిని వాణిజ్య సముదాయాలుగా మార్చి భారీ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. నగర పాలక సంస్థల పునర్విభజన అనంతరం కీసర సర్కిల్ ఏర్పాటై అధికారులు బాధ్యతలు చేపట్టినప్పటికీ, అక్రమ నిర్మాణాలపై కట్టడి కనిపించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా అక్రమ నిర్మాణాలు నిర్భయంగా కొనసాగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంత మంది ప్రభావశీలుల మద్దతుతోనే ఈనిర్మాణాలు సాగుతున్నాయని కూడా స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులు, వాణిజ్య ప్రాంతాల్లో ఇలాంటి భారీ షెడ్లు నిర్మించడం వల్ల భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు పెరగడమే కాకుండా పట్టణ ప్రణాళికకు కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశముందని పేర్కొంటున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి, అనుమతులు లేకుండా నిర్మించిన షెడ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే కీసర ప్రాంతం పూర్తిగా అక్రమ నిర్మాణాల కేంద్రంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# మానకొండూర్ ప్రజలకు గుడ్ న్యూస్..

## త్వరలోనే కొత్త రోడ్లు



**మానకొండూర్,తెలంగాణ దిశ :** కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం ప్రజలకు గుడ్ న్యూస్ అనే చెప్పాలి. నియోజకవర్గంలో కలెక్టర్ చిత్రా మిశ్రా, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నియోజకవర్గంలో రోడ్లను పరిశీలించారు. ఈ పర్యటనలో గుంతలమయమైన రోడ్లు, శిథిలావస్థకు చేరుకున్న కల్వర్టులు, వంతెనలను కలెక్టర్ స్వయంగా చూసి సమస్య తీవ్రతను గుర్తించారు. త్వరలో కొత్త రోడ్లు:రోడ్ల దుస్థితిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే ప్రభుత్వ అనుమతులతో ఈ మార్గంలో కొత్త రోడ్ల పనులు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులు వాహనదారులు, గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ రోడ్లకు 'మహర్దశ' కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, తహశీల్దార్ విజయ్ కుమార్, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మంత్రలయానికి మంచి రోజులు

**కర్నూలు,తెలంగాణ దిశ :** కర్నూలు జిల్లా మంత్రాలయానికి బైపాస్ రోడ్డుకు సంబం ధించి తొలి అడుగు పడింది. కొత్త బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. రూ.59 కోట్లతో మంత్రాలయానికి బైపాస్‌ను రెండు లైన్లుగా నిర్మిస్తున్నారు. ఈ బైపాస్ అందుబాటులోకి వస్తే మంత్రాల యానికి ట్రాఫిక్ కష్టాలు తీరినట్లే. నిత్యం మంత్రాలయానికి భక్తులు తరలివస్తుంటారు.. ఈ క్రమంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నా యి. దీంతో ప్రభుత్వం బైపాస్ రోడ్డు కోసం నిధులు విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా హైవేలు, స్టేట్ హైవేలతో పాటుగా అవసరమైన చోట్ల రోడ్లను విస్తరిస్తున్నారు. అలాగే కొన్ని నగరాలకు, పట్టణాలకు బైపాస్ రోడ్లను నిర్మిస్తున్నారు. రాయలసీమలో కూడా రోడ్ల నిర్మాణంపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఇటీవల మంత్రా లయం బైపాస్‌రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదలైన సంగతి తెలిసిందే. అయితే తాజాగా మంత్రాలయం బైపాస్ నిర్మాణానికి తొలి అడుగు పడింది. మంత్రాలయం బైపాస్‌కు శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు స్థానిక నేతలతో కలిసి భూమిపూజ నిర్వహించారు. రూ.59 కోట్లతో నిర్మించే ఈ రెండు లైన్ల బైపాస్ నిర్మాణం పూర్తయితే మంత్రాలయానికి ట్రాఫిక్ చిక్కులు తొలగిపోతాయం టున్నారు.కర్నూలు జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామి కొలువై ఉన్నారు. స్వామివారిని దర్శించుకోవడానికి నిత్యం దేశ, విదేశాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, సినీ, రాజకీయ, వ్యాపారంగాల నుంచి ప్రముఖులు వస్తుంటారు. వీరితో పాటుగా నిత్యం భక్తులు మంత్రాలయం వస్తుండటంతో వాహనాల రద్దీ కూడా పెరిగింది. మంత్రాలయం వచ్చే భక్తులకు తోడు స్థానికుల వాహనాలతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 167వ నంబర్ జాతీయ రహదారి మంత్రాలయం మధ్య నుంచి వెళుతుండంతో ట్రాఫిక్ రద్దీ కనిపిస్తోంది.. భక్తులు కూడా ఇబ్బందిప డుతున్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంపై శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఫోకస్ పెట్టారు.శ్రీమఠం పీఠాధిపతి, ప్రజా ప్రతినిధులు మంత్రాల యానికి బైపాస్ రోడ్డు కావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.


బైపాస్ రోడ్డు నిర్మిస్తే ట్రాఫిక్ సమస్యల నుంచి రిలీఫ్ దక్కుతుందని వివరించారు. ఈ మేరకు కల్లుదేవకుంట- చెట్నేపల్లి మధ్య 4 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. బైపాస్ నిర్మించేందుకు మొత్తం రూ.59 కోట్లతో నిధులు కూడా విడుదలకాగా.. బైపాస్ కోసంభూమిని సేకరించి భూమిపూజ చేశారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తూ గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి దిశగా తీసుకెళ్లడమే లక్ష్యమన్నారు మంత్రాలయం నియోజకవర్గం టీడీపీ ఇంఛార్జ్ రాఘవేంద్ర రెడ్డి. మంత్రాలయం క్షేత్ర అభివృద్ధి, భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించిందన్నారు.

## తెలంగాణపై పార్లమెంట్ సాక్షిగా

# విషం కక్కిన బీజేపీ

### - ఇండియా - పాకిస్థాన్ తో పోల్చిన ఎంపీ తక్షణమే

### తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, ఏప్రిల్ 16, (తెలంగాణ దిశ)** :తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుపై మరోసారి పార్లమెంట్ సాక్షిగా భారత దేశం, పాకిస్థాన్ తో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. నేడు పార్లమెంట్ లో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారతదేశం - పాకిస్థాన్ ఏర్పాటు తో పోల్చడం నీచమైన చర్యగా విమర్శించారు. బీజేపీకి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడటం ఇష్టం లేదని అర్థం అవుతుందని ఆయన అన్నారు. రాజ్యాంగ పద్ధతిలో ఏర్పడిన రాష్ట్రాన్ని పాకిస్థాన్ ఏర్పాటు తో పోల్చడం కంటే దారుణం మరొకటి ఉండదన్నారు. ఇన్ని సంవత్సరాలు తెలంగాణ పైన కపట ప్రేమ ఎందుకు చూపెడుతుందనేది పార్లమెంట్ సాక్షిగా బీజేపీ ఎంపీ మాటలతో తేట తెల్లం అయ్యిందని ఆయన అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం హయాంలో రాష్ట్రం ఎంత అభివృద్ధి చెందినదో, దాంట్లో కేంద్రం ఎటువంటి సాయం చేయకపోవడంతో పాటు రావాల్సిన నిధులు విడుదల చేయకపోవడానికి కారణం అర్థం అవుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కు జాతీయ హోదా కల్పించకపోవడం కూడా అందుకేనా అనిపిస్తుందని ఆయన అన్నారు. మన రాష్ట్రం నుండి 8 మంది ఎంపీ లు ఉండి కూడా ఒక ప్రాజెక్ట్ తేకపోవడం వెనుక బీజేపీ సవతి తల్లి ప్రేమ కనిపిస్తుందని ఆయన అన్నారు. రాష్ట్రం నుండి ఒక కేంద్ర మంత్రి, మరో కేంద్ర సహాయ మంత్రి ఉండి కూడా తెలంగాణ విభజనను పాకిస్తాన్ విభజనతో పోల్చడం సిగ్గు చేటని ఆయన అన్నారు. స్వర్గీయ సుష్మ స్వరాజ్ ను తెలంగాణ చిన్నమ్మ గా పిలుస్తారని, ఈ రోజు తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కోసం ఉద్యమం చేసిన సుష్మాస్వరాజ్ ను అవమానించినట్లేనని ఆయన అన్నారు. బజప్త బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య క్షమాపణ చెప్పాలని, మన రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న 8 మంది ఎంపీ లు క్షమాపణ చెప్పాలని, లేదా తక్షణమే తెలంగాణ ఏర్పాటును అవమానించినందుకు బాధ్యతగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలు అన్ని గమనిస్తున్నారని, స్వరాష్ట్ర సాధన కోసం ఉద్యమం చేసిన బిఆర్ఎస్ పార్టీ మనకు శ్రీరామ రక్ష అని, ఈ సారి రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో ఉన్న బీజేపీ పార్టీకి తగిన బుద్ధి చెప్తారని అన్నారు. తెలంగాణ గడ్డ ఉద్యమాల అడ్డ ఎవడు పడితే వాడు తెలంగాణ గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే చిరుతామని ఆయన హెచ్చరించారు.

# ఇంట్లోనే సముద్ర స్నానం




ఏడాదికి ఒక్కసారైనా సముద్ర స్నానం చేయాలని పెద్దలు అంటుంటారు. శాస్త్రపరంగా ఎలా ఉన్నా.. సైన్స్ పరంగా మాత్రం సాగర స్నానంతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అయితే, సముద్ర స్నానం వీలుకానివాళ్లు.. ఇంట్లో నీటిలోనే కొద్దిగా ఉప్పును కలుపుకోవాలని సలహా ఇస్తున్నారు. 'ఉప్పు నీటి' స్నానం.. ఆరోగ్యానికి అనేక విధాలుగా మంచిదని అంటున్నారు. జోర్డాన్ సరిహద్దులో ఉండే డెడ్‌సీ (మృత సముద్రం) సందర్శనకు ఏటా లక్షలమంది పర్యాటకులు తరలివస్తుంటారు. లవణీయత (ఉప్పు శాతం) అత్యధికంగా ఉండే ఈ సముద్రపు నీటితో స్నానం చేస్తే.. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని అనేక పరిశోధనల్లోనూ తేలింది. మరి.. ఇలాంటి ప్రయోజనాలే ఇంట్లోనే పొందాలంటే.. నీటిలో కొద్దిగా ఉప్పు కలుపుకొంటే చాలు. మెగ్నీషియం, క్యాల్షియం, పొటాషియం వంటి అనేక ఖనిజాలతో నిండి ఉండే ఉప్పు.. శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. ఉప్పు నీటితో స్నానం చేయడం వల్ల చర్మంపై ఉండే మృతకణాలు పూర్తిగా తొలగిపోతాయి. వేసవిలో చెమట అధికంగా పడుతుంది. దీనివల్ల రింగ్‌వార్మ్, దురద లాంటి చర్మ వ్యాధులు ఇబ్బంది పెడతాయి. ఉప్పు నీటితో స్నానం.. చర్మ వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది. ఉప్పులో ఉండే యాంటి బ్యాక్టీరియల్ లక్షణాలు.. ఇన్ఫెక్షన్ల నుంచి చర్మాన్ని కాపాడతాయి. చర్మాన్ని మరింత ప్రకాశవంతంగా మారుస్తాయి. కీళ్ల నొప్పులు, వెన్నునొప్పుల నుంచి ఉప్పునీటి స్నానం ఉపశమనం కలిగిస్తుంది. గోరువెచ్చని నీటిలో కొద్దిగా ఉప్పు కలిపి స్నానం చేస్తే.. వాపులు కూడా తగ్గుతాయి. ప్రతిరోజూ స్నానం చేసే నీటిలో చిటికెడు ఉప్పును కలిపేస్తే.. అలసట, ఒత్తిడి దూరం అవుతుంది. శరీరానికి కొత్త ఉత్సాహం వస్తుంది. శరీరంలో మంట, దురద, వాపు వంటి సమస్యలను తగ్గించడంలోనూ ఉప్పునీటి స్నానం సాయపడుతుంది.

# స్లిమ్‌గా.. స్టైలిష్‌గా..



ఒకప్పుడు కేవలం కాల్స్ చేయడానికి, మెసేజ్‌లు పంపడం కోసమే ఫోన్ వాడేవాళ్లం. ఇప్పుడు.. అదే ఫోన్ కంటెంట్ సృష్టిస్తున్నది. మన పనులన్నీ చకచకా చేసేస్తున్నది. మన రోజువారీ జీవితాన్ని ప్రపంచంతో ముడివేస్తున్నది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీ రాకతో ఈ బంధం మరింత బలపడింది. ఈ క్రమంలో సామ్‌సంగ్ తీసుకొస్తున్న గెలాక్సీ ఎస్25 ఎడ్జ్ 'ఫోన్ అంటే ఇది' అనిపించేలా చేస్తున్నది. సరికొత్త ఏఐ ఇముడ్చుకున్న ఈ స్మార్ట్‌ఫోన్.. వ్యక్తిగత సహాయకుడిగా మారిపోతున్నది. ఇక డిజైనింగ్ విషయానికి వస్తే స్లిమ్‌లుక్‌తో ట్కస్టైలిష్‌గా కనువిందు చేస్తున్నది. ఈ ఫోన్ మందం కేవలం 5.85 మిల్లీమీటర్లు మాత్రమే. ఇందులో చెప్పుకోదగిన మరో అప్‌డేట్.. 200 మెగాపిక్సెల్ కెమెరా! గెలాక్సీ ఏఐ సాయంతో ఈ కెమెరా ప్రతి దృశ్యాన్ని అద్భుతంగా మార్చేయగలదు. మీరు తీసిన ఫొటోలను చక్కని స్టోరీలా మార్చేస్తుంది కూడా! ఏదైనా పెళ్లికి వెళ్లినప్పుడు ఓ పది ఫొటోలు తీశారే అనుకోండి.. వాటన్నిటినీ కలిపి చక్కని స్టోరీ రీల్ చేసేస్తుంది. ఈ కెమెరాతో 8%ఖ% వీడియోలు తీయొచ్చు. ఇక ఇతర స్పెసిఫికేషన్స్ విషయానికొస్తే.. స్లిమ్ ఫోన్ బరువు 163 గ్రాములు. ఫ్లాట్-ఫ్రేమ్ డిజైన్‌తో ముస్తాబయ్యింది. స్క్రీన్ పొడవు 6.7 అంగుళాలు. అమెలెడ్ డిస్‌ప్లే, గొరిల్లా గ్లాస్ సెరామిక్ 2 ప్రొటెక్షన్‌తో దృఢంగా తయారైంది. స్నాప్‌డ్రాగన్ 8 ఎలిట్ ప్రాసెసర్,12 జీబీ రామ్, 512జీబీ స్టోరేజీతో ఇతర స్పెసిఫికేషన్లు!3,900 ఎంఏహెచ్‌బ్యాటరీ ఉంది. ఫొటోగ్రఫీ లవర్స్, టెకీలకు ఇది చక్కని ఎంపిక. దీని అంచనా ధర: రూ.79,999.

# అన్ని రోగాలకూ ఒకటే ఫార్ములా!



ఉద్యోగ లక్ష్యాలు, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు.. సగటు జీవిపై మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయి. దీర్ఘకాలంలో నిద్రలేమి, గుండె సంబంధ రోగాలతోపాటు ఇతర అనారోగ్య సమస్యలకు దారి తీస్తున్నాయి. ఇప్పటికే కొవిడ్ మహమ్మారి వల్ల ఊపిరితిత్తులు ఉక్కిరిబిక్కిరయ్యాయి. ఫలితంగా, చాలామందిని శ్వాస, ఉదర సంబంధ సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. ఈ సమస్యలన్నిటికీ '4 %- 7 -% 8 బ్రీతింగ్ టెక్నిక్'తో చెక్ పెట్టేయొచ్చని నిపుణులు చెబుతున్నారు.

ఇలా చేస్తే చాలు..: ఈ బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్ చేయడం చాలా సులభం. ముందుగా నాలుగు సెకన్ల పాటు ముక్కు ద్వారా శ్వాసను లోపలికి పీల్చుకోవాలి. ఆ తరువాత ఏడు సెకన్ల పాటు శ్వాసను నిలిపివేయాలి. ఆ తరువాత 8 సెకన్ల పాటు శ్వాసను మెల్లగా బయటికి వదలాలి. ఇలా.. రెండు నుంచి నాలుగు సార్లు రిపీట్ చేస్తే సరిపోతుంది.

ఎన్నో లాభాలు..: 4-7-8 బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్ మానసిక ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. ఈ టెక్నిక్‌ను ఫాలో అవ్వడం ద్వారా శ్వాసపై ధ్యాస పెరుగుతుంది. దాంతో, ఆలోచనలు అదుపులో ఉండి.. మానసిక ఒత్తిడి దూరం అవుతుంది. ప్రతిరోజూ ఐదు నిమిషాలపాటు ఈ ఫార్ములాను ఫాలో అయితే.. మనసు ప్రశాంతంగా మారుతుంది. ఈ విషయం.. బ్రెయిన్ సైన్సెస్ జర్నల్‌లో ప్రచురితమైంది. శరీరంలో కార్టిసాల్ స్థాయిలను తగ్గించడంలో '4-7-8 ఫార్ములా' సాయపడుతుంది. ఫలితంగా, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. నిద్రలేమి దూరం అవుతుంది. ఈ ఫార్ములాతో శరీరం పూర్తిగా రిలాక్సయి.. నిద్ర నాణ్యత పెరుగుతుంది. బ్రీతింగ్ ఎక్సర్‌సైజులు గుండె ఆరోగ్యానికి భరోసా ఇస్తాయని అనేక ఫిజియోలాజికల్ రిపోర్ట్స్ చెబుతున్నాయి. అందులోనూ '4-7-8 ఫార్ములా' హృదయ స్పందనలను కంట్రోల్‌లో ఉంచుతుంది. రక్తపోటును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఫలితంగా, హృద్రోగ సమస్యలను దూరం చేస్తుంది. '4-7-8 ఫార్ములా'ను రెగ్యులర్‌గా ఫాలో అయ్యేవారిలో ఆక్సిజన్ స్థాయిలు పెరుగుతాయి. దీంతో ఊపిరితిత్తులపై భారం తగ్గి.. శ్వాసకోశ సమస్యలూ తగ్గుముఖం పడుతాయి. ఎప్పుడూ ఆందోళనగా ఉంటున్నారా? అయితే, '4-7-8 ఫార్ములా'ను ప్రయత్నించాలని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. ఈ ఎక్సర్‌సైజ్ శ్వాసను నియంత్రించడంతోపాటు ఆందోళన లక్షణాలను తగ్గిస్తుందని చెబుతున్నారు.



# పీసీవోఎస్ ఉన్న మహిళలు తప్పనిసరిగా పాటించాల్సిన డైట్..

పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పీసీవోఎస్).. ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది మహిళలు ప్రస్తుతం ఈ వ్యాధితో బాధపడుతున్నారు. పీసీవోఎస్ వచ్చిన మహిళల్లో రుతుక్రమం సరిగ్గా ఉండదు. శరీరంలో ఆండ్రోజన్ స్థాయిలు పెరిగిపోతాయి.

సంతాన లోపం సమస్య ఏర్పడుతుంది. అధికంగా బరువు పెరుగుతారు. మొటిమలు ఏర్పడుతాయి. ఇన్సులిన్ నిరోధకత ఏర్పడి టైప్ 2 డయాబెటిస్ వస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతున్న ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా (

పతి 10 మంది మహిళల్లో ఒకరు పీసీవోఎస్ సమస్యతో బాధపడుతున్నారు. అయితే ఈ సమస్య వచ్చిన వారు కచ్చితంగా డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకుని మందులను వాడాల్సి ఉంటుంది. అలాగే పీసీవోఎస్‌ను తగ్గించుకునేందుకు జీవన విధానం కూడా ముఖ్య పాత్ర పోషిస్తుంది. ప్రధానంగా తీసుకునే ఆహారంలో అనేక మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది.

ఒత్తిడిని తగ్గించుకోవాలి..: పీసీవోఎస్ ఉన్న మహిళలు శారీరక శ్రమ జరిగేలా చూసుకోవాలి. అలా లేకపోతే రోజుకు కనీసం 30 నిమిషాల పాటు తేలికపాటి వాకింగ్ అయినా చేయాలి. ఒత్తిడిని తగ్గించుకోవాలి. అందుకు గాను యోగా, ధ్యానం ఎంతగానో సహాయం చేస్తాయి. పచ్చని ప్రకృతిలో రోజూ కాసేపు గడపడం, పుస్తకాలు చదవడం, మనస్సుకు నచ్చిన సంగీతాన్ని వినడం వల్ల కూడా ఒత్తిడి స్థాయిలు తగ్గుతాయి.

అలాగే రోజూ తగినన్ని గంటలపాటు నిద్రించాలి. పీసీవోఎస్ ఉన్న మహిళల్లో నిద్ర ముఖ్య పాత్ర పోషిస్తుంది. కనుక రోజుకు తప్పనిసరిగా 7 నుంచి 8 గంటల నిద్ర అవసరం. అలాగే డాక్టర్ సూచన మేరకు ఐనోసిటోల్, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్ డి సప్లిమెంట్లను వాడాలి. ఇవి ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తాయి. టైప్ 2 డయాబెటిస్ రాకుండా చూస్తాయి. అలాగే హార్మోన్లు సమతుల్యంలో ఉండేలా చేస్తాయి. నేషనల్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ చెబుతున్న ప్రకారం పీసీవోఎస్ వచ్చిన మహిళలు అందరికీ కూడా ఒకేలాంటి మెడిసిన్లను వాడాల్సిన అవసరం ఉండదు. మహిళను బట్టి, ఆమె ఆరోగ్య పరిస్థితులను బట్టి భిన్న రకాల మందులను వాడాల్సి ఉంటుంది.

ఈ ఆహారాలను తినాలి..: సరైన ఆహారం తీసుకుంటూ డైట్ పాటిస్తే షుగర్ లెవల్స్‌ను పెరగకుండా చూసుకోవచ్చు. శరీరంలో వాపులు కూడా తగ్గుతాయి. హార్మోన్లు సమతుల్యంలో ఉంటాయి. పీసీవోఎస్ ఉన్న మహిళల్లో ఇన్సులిన్ నిరోధకత సహజంగానే చాలా మందిలో అధికంగా ఉంటుంది. అందువల్ల ఇన్సులిన్ నిరోధకతను తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. అందుకు గాను షుగర్ తక్కువగా ఉండే ఆహారాలను, ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలను తినాలి. తక్కువ గ్లైసీమిక్ ఇండెక్స్ (జీఐ) విలువ ఉండే ఆహారాలను తినాలి. ఓట్స్, కినోవా, బ్రౌన్ రైస్‌ను తినాలి. రీఫైన్ చేయబడిన ఆహారాలను తినడం మానేయాలి. దీంతో ఇన్సులిన్ నిరోధకతను తగ్గించుకో వచ్చు. అధిక బరువు తగ్గుతారు. డయాబెటిస్ రాకుండా ఉంటుంది. పీసీవోఎస్ సమస్య నుంచి బయట పడవచ్చు.

ప్రోటీన్లు ముఖ్యం..: ప్రోటీన్లు ఎక్కువగా ఉండే కోడిగుడ్లు, తోఫు, పప్పు దినుసులను, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే అవకాడో, నట్స్, సీడ్స్, ఆలివ్ ఆయిల్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే పీసీవోఎస్ ఉన్న మహిళలకు మేలు జరుగుతుంది. చక్కెర అధికంగా ఉండే ఆహారాలను తినడం మానేయాలి. ఖర్జూరాలను తినవచ్చు. పాలకూర, పియర్స్ పండ్లు, నారింజ వంటి వాటిని తింటుండాలి. పాలు, పాల ఉత్పత్తులకు దూరంగా ఉండాలి. ఇలా ఆహారంలో పలు మార్పులు చేసుకుంటూ రోజూ వ్యాయామం చేస్తూ అన్ని జాగ్రత్తలను పాటించడంతోపాటు డాక్టర్లు ఇచ్చిన మందులను క్రమం తప్పకుండా వాడుతుంటే పీసీవోఎస్ సమస్య నుంచి మహిళలు సులభంగా బయట పడతారు. సంతానం కలిగే అవకాశాలు మెరుగు పడతాయి.

## ఈ ప్రయోజనాల గురించి తెలిస్తే..

# రెడ్ రైస్‌ను తినడం వెంటనే మొదలు పెడతారు..!

దక్షిణ భారతదేశంతోపాటు ఆసియాలోని అనేక దేశాలకు అన్నమే ప్రధాన ఆహారంగా మారిందన్న విషయం అందరికీ తెలిసిందే. ఈ క్రమంలోనే బియ్యంతో అనేక రకాల వంటకాలను కూడా చేసి తింటుంటారు. అయితే ప్రస్తుతం మారిన ఆహారపు అలవాట్లు, ఆరోగ్య ప్రమాణాల దృష్ట్యా తెల్ల బియ్యం తినకూడదని, బ్రౌన్ రైస్‌ను తినాలని వైద్యులు సూచిస్తున్నారు. అందులో భాగంగానే చాలా మంది బ్రౌన్ రైస్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటున్నారు. బ్రౌన్ రైస్‌ను తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. అయితే బ్రౌన్ రైస్ మాత్రమే కాకుండా మరో రైస్ వెరైటీ కూడా ప్రస్తుతం బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. అదే రెడ్ రైస్. ఇది మదురు ఎరుపు రంగులో ఉంటుంది. చూసేందుకు అంతగా ఆకర్షణీయంగా ఉండదు. కానీ ఈ రైస్‌ను తింటే బోలెడు ప్రయోజనాలు పొందవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

అధిక బరువు తగ్గేందుకు..: రెడ్ రైస్‌లో ఆంథో సయనిన్స్ అధికంగా ఉంటాయి. అందువల్లే రెడ్ రైస్‌కు ఆ రంగు వచ్చింది. ఆంథో సయనిన్స్ శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ల జాబితాకు చెందుతాయి. ఇవి బెర్రీ పండ్లతోపాటు ఎరుపు రంగు ఆహారాల్లో అధికంగా ఉంటాయి. ఈ యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. అలాగే బ్రౌన్ రైస్‌తో పోలిస్తే రెడ్ రైస్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది.ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. మలబద్ధకం తగ్గేలాచేస్తుంది. ఈ ఫైబర్ వల్ల కడుపు నిండిన భావన కలుగు తుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారంపై నియంత్రణ ఏర్పడుతుంది. ఆహారం అధికంగా తినకుండా ఉంటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయ పడుతుంది.

షుగర్, కొలెస్ట్రాల్‌కు చెక్..: ఇతర రైస్ వెరైటీలతో పోలిస్తే రెడ్ రైస్ గ్లైసీమిక్ ఇండెక్స్ (జీఐ) విలువ చాలా తక్కువ. ఈ అందువల్ల ఈ రైస్‌ను తింటే షుగర్ లెవల్స్ పెరగవు. కనుక డయాబెటిస్ ఉన్నవారు ఈ రైస్‌ను నిరభ్యంతరంగా తినవచ్చు. పైగా



ఈ రైస్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు షుగర్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారికి రెడ్ రైస్ ఎంతో మేలు చేస్తుంది. రెడ్‌రైస్‌లో అధికంగా ఉండే ఫైబర్ కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గిస్తుంది. ముఖ్యంగా చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గి మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) పెరుగుతుంది. దీంతో రక్త నాళాల్లో ఉండే కొవ్వు కరుగుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు.

వాపులు, నొప్పులు తగ్గేందుకు..: రెడ్ రైస్‌లో అనేక మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. ఈ రైస్‌లో ఉండే ఐరన్ రక్తం తయారయ్యేలా చేస్తుంది. రక్తహీనతను తగ్గిస్తుంది. ఈ రైస్‌లో మాంగనీస్, మెగ్నిషియం అధికంగా ఉంటాయి. ఇవి ఒత్తిడి, ఆందోళనను తగ్గించి మైండ్ రిలాక్స్ అయ్యేలా చేస్తాయి. దీంతో నిద్ర చక్కగా పడుతుంది. కండరాలకు ప్రశాంతత లభిస్తుంది. కండరాల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. రెడ్ రైస్‌లో ఉండే ఫాస్ఫరస్ ఎముకలను బలంగా మారుస్తుంది. జింక్ కూడా ఈ రైస్‌లో అధికంగానే ఉంటుంది. ఇది ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుతుంది. రెడ్ రైస్‌లో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు అధికంగా ఉంటాయి. అందువల్ల ఈ రైస్‌ను తింటే వాపులు, నొప్పులు తగ్గుతాయి. ఆర్థ్రైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. ఇలా రెడ్ రైస్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలను పొందవచ్చు.








# అనగనగా.. కథాతీతం!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** కథ చెబుతూ నిద్రపుచ్చాల్సిన నాన్న.. ల్యాపీతో బిజీ! కథలు చెబుతూ బువ్వ తినిపించాల్సిన అమ్మ.. ఆఫీస్ వర్క్‌లో బిజీబిజీ!తాతయ్య, బామ్మ ఊళ్లో! చిన్నకుటుంబాల్లో పెరుగుతున్న చిన్నారులు ఎదుర్కొం టున్న పెద్ద చిక్కు ఇది. కథలు చెప్పే తీరిక లేక స్మార్ట్ ఫోన్ చేతికిస్తు న్నారు తల్లిదండ్రులు. దీంతో చందమామ కథలా సాగిపోవాల్సిన వారి బాల్యం.. రీల్స్‌లో చిక్కుకుపోతున్నది. ఫలితం.. ఉన్నతమైన పౌరులుగా ఎదగాల్సిన చిన్నారులు చిన్న వయసులోనే తీవ్ర ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితికి విరుగుడు కథ చెబుతున్నది 'కథాతీతం' గ్రంథాలయం. కాంక్రీట్ వనంలో పల్లెటూరి ఇంటిని తలపించే లోగిలిలో ఈ లైబ్రరీని నెలకొల్పారు శిల్పా కిరణ్‌వీర్.పిల్లలకు నీతికథా సుధను పంచుతున్న శిల్పా పంచుకున్న విశేషాలు ఆమె మాటల్లోనే.. పండుగ వేళల్లో.. ఆ పర్వం ప్రాముఖ్యాన్ని తెలిపేలా కథ రూపంలో, డ్రామా రూపంలో కార్యక్రమాలు నిర్వహిస్తు ంటాం. పిల్లల్లో వచ్చిన మార్పు గురించి తల్లిదండ్రుల అభిప్రాయాలు కూడా తెలుసుకుంటాం. పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఈ ఏడాది 'రచన' పేరుతో ఏప్రిల్13 నుంచి మే 30 వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నాం. ఇందులోప్రధానంగా కథలుచెప్పడం, వ్యాస రచన పోటీలు, నాటికలు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నాం. నా చిన్నతనంలో నేర్చుకున్న నీతి కథలే నా జీవితానికి ఒక మార్గాన్ని చూపించాయని నమ్ముతాను. నేను పుట్టింది మైసూర్, మెట్టినిల్లు తెలంగాణ. మా నాన్న థియేటర్ ఆర్టిస్ట్‌గా ఉండేవారు. కుటుంబ విలువలు తెలిపే నాటికలు ప్రదర్శిస్తుండేవారు. నాటికల మీద ఆసక్తితో నేను బాలనటిగా ఎన్నో నాటికల్లో పాల్గొన్నాను. నాటికల ద్వారా ప్రజలకు ఎంతోకొంత నీతి నేర్పించవచ్చని తర్వాతి కాలంలో తెలిసొచ్చింది. వివాహం అయిన తరువాత సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో స్థిరపడ్డాను. తల్లిగా నా పిల్లలకు నీతి కథలు చెబుతూ ఉండేదాన్ని. వాళ్లను విద్యారణ్య పాఠశాలలో చేర్పించినప్పుడు ఆ వాతావరణం నన్ను ఎంతగానో ఆకర్షించింది. వెంటనే నా ఉద్యోగానికి రాజీనామా చేసి అదే పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేరాను. అందుకోసం ప్రత్యేక కోర్స్ కూడా చేశాను.తెలంగాణ పర్యాటకం: నిజానికి చిన్నప్పటినుంచి టీచర్ కావాలనే కోరిక కూడా ఉండేది. కానీ, పరిస్థితుల ప్రభావం ఐదేండ్లపాటు సాఫ్ట్‌వేర్ కొలువు చేయాల్సి వచ్చింది. కానీ, నా పిల్లల వల్ల నాకు నచ్చిన వృత్తిలో చేరడం నాకు ఎంతో సంతోషాన్నిచ్చింది. అక్కడ విద్యార్థులకు కథలు చెప్పడమే నా పని. హ్యాపీగా నా పని నేను చేసుకుంటూ ఉండేదాన్ని. కరోనా సమయంలో స్టోరీ టెల్లింగ్‌తో ఇతర సబ్జెక్టులు కూడా నేర్పించాలని చెప్పారు. దాంతో ఈ సబ్జెక్టులను కూడా కథల రూపంలోనే చెప్పడం మొదలుపెట్టాను. అలా బోధించడం నాకు ఆనందాన్ని ఇచ్చినా పిల్లలు మాత్రం తమ అభిప్రాయాన్ని చెప్పేందుకు సమయం సరిపోయేది కాదు. నాకున్న నలభై నిమిషాల్లో కథ చెప్పి ఒక్కొక్కరి అభిప్రాయం తెలుసుకునేందుకు వీలుపడేది కాదు. పిల్లలు ఎంతో ఆశతో 'మేడం! మేం చెబుతాం' అని చేతులు పైకెత్తి అడిగినా.. వారికి అవకాశం ఇవ్వడం కుదరలేదు. పిల్లల కోసం చెప్పే కథల్లో.. వాళ్ల భాగస్వామ్యం లేదనే బాధతో 2023లో అక్కణ్నుంచి బయటికి వచ్చేశా. నేను కథలు చెబుతానని చాలా మందికి తెలుసు. ఉద్యోగం వదిలేసి ఇంట్లోనే ఉంటున్నానని తెలిసి మా చుట్టు పక్కల పిల్లలు 'కథలు చెప్పండి ఆంటీ!' అంటూ రావడం మొదలు పెట్టారు. నేనూ పిల్లలకు కథలు చెప్పడానికి సిద్ధమయ్యా! అందరు పిల్లలకు ఒకేసారి కాకుండా, ఒక్కో చిన్నారికీ గంట సమయం కేటాయిస్తూ కథ చెప్పేదాన్ని. తర్వాత వారికి ఏం అర్థమైందో, ఏమైనా సందేహాలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకునేదాన్ని. అందుకే గ్రంథాలయం: విద్యారణ్యలో, చుట్టుపక్కల ఉండే పిల్లల్లో కథలు వినడం వల్ల కలిగే మార్పును దగ్గరనుంచి గమనించాను. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్‌తో పుట్టి పెరుగుతున్న ఈ తరం చిన్నారులకు కథల అవసరం చాలా ఉంది. వారికి మార్గనిర్దేశనం చాలా అవసరం. ఈ మేరకు ఏడు నెలల కిందట గచ్చిబౌలిలో 'కథాతీతం' పేరుతో గ్రంథాలయం ఏర్పాటు చేశాను. హిందీ, ఇంగ్లిష్, తెలుగు కథల పుస్తకాలు అందుబాటులో ఉంచాను. ఇక్కడ దాదాపు ఐదువేల పుస్తకాలు ఉన్నాయి. ఒక్క సోమవారం మినహాయించి వారంలో మిగతా రోజులన్నీ మా కథాతీతం తెరిచే ఉంటుంది. చిన్నారులు తమ తల్లిదండ్రులతో లేదా స్నేహితులతో కలిసి వచ్చి తమకు నచ్చిన పుస్తకం తీసుకొని చదువుతుంటారు. ఏవైనా సందేహాలు ఉంటే కూడానన్ను అడిగి నివృత్తి చేసుకుంటారు. ఆ తరువాత నేను వాళ్లకు కథలు చెబుతూ వారి అభిప్రాయాలు అడుగుతుంటాను. కథల పుస్తకాల్లో ఉన్న బొమ్మలు వేసేందుకు కావాల్సినపేపర్,పెన్సిల్ కూడా సిద్ధం చేసి ఇస్తుంటాం. పజిల్స్ కూడా పెడతాం. పుస్తకాలు చదివించ డంతో పాటు ఇతర కెరీర్ గైడెన్స్ క్లాస్‌లు కూడా నిర్వహిస్తున్నాం. అదే మా ఆలోచన: చాలామంది లైబ్రరీ అంటే టేబుళ్లు, కుర్చీలు ఉండే గదిలా ఊహించుకుంటారు. కానీ, కథాతీతం అలా ఉండదు. మనం పుట్టిపెరిగిన పల్లెటూరిలో ఉండే పెంకుటిళ్లు లాగా అందంగా ఉంటుంది. పిల్లలు కూడా ఇంట్లో ఉన్నామనే అనుభూతి చెందాలనే ఆలోచనతోనే దీనినిఇలా తీర్చిదిద్దాం.ఒక్కసారి కథాతీతంలోకి వచ్చిన పిల్లలు పక్కన ఫోనున్నా.. దాన్ని పట్టించుకోకుండా, తమకు నచ్చిన పుస్తకంలో నిమగ్నమై చదువుకుంటూ ఉంటారు. మేం కూడా పిల్లల ముందు ఫోన్ వినియోగించం. పిల్లలతో వచ్చే తల్లిదండ్రులకు కూడా ఫోన్ వాడొద్దనిచెబుతాం. ఈ గ్రంథాలయంలో రెండో తరగతి పిల్లల నుంచి మొదలు పదోతరగతి చదివే విద్యార్థుల వరకు వస్తుంటారు. 40మంది చిన్నారులు రెగ్యులర్‌గా వస్తున్నారు. తమ పిల్లలు నిజాయ తీగా జీవించాలని ప్రతి తల్లిదండ్రులూ కోరుకుంటారు. మా కథలతో అలాంటి తరాన్ని తయారు చేయాలన్నదే ఈ కథాతీతం లక్ష్యం. ఇప్పుడిప్పుడే ప్రారంభమైన మా జర్నీ.. వందల, వేల మంది పిల్లలను ఉన్నతమైన పౌరులుగా తీర్చిదిద్దే సంకల్పంతో ముందుకుసాగుతున్నాం.


# కడప జిల్లాలో కుక్కల దాడిలో చిరుత కూన మృతి



కడప : వైఎస్సార్ కడప జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కుక్కల గుంపు దాడిలో ఓ చిరుత పులి కూన మృతి చెందింది. దువ్వూరు మండలం చిన్నబకరాపురం గ్రామ శివార్లలో ఈ సంఘటన వెలుగు చూసింది. తీవ్రమైన ఎండల కారణంగా అడవిలో నీటి వనరులు అడుగంటిపోవడంతో, దాహం తీర్చుకోవడానికి చిరుత కూన గ్రామంలోకి వచ్చినట్లు అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు. గ్రామ శివార్లలోని రైతు పుల్లారెడ్డి పొలంలో చిరుత కూన మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. నీటి కోసం వచ్చిన చిరుతను వీధి కుక్కలు చుట్టుముట్టి తీవ్రంగా దాడి చేయడంతో అది ప్రాణాలుకోల్పోయిందని గ్రామస్థులు తెలిపారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ డీఆర్ఓ అన్వర్ హుస్సేన్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం, చిరుత కూన మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిర్వహించారు. చిరుత కూన మృతి చెందడంతో పొలాల్లో చిరుత పులుల సంచారం ఉందేమోనని రైతులు, పశువుల కాపరులు ఆందోళన చెందుతున్నారు.

## తమిళనాడులో అధిక సంపన్న అభ్యర్థి లీమా..

### ఆమె ఆస్తులు విలువ ఎంతో తెలుసా..?



చెన్నై : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో 58 ఏళ్ల అన్నాడీఎంకే అభ్యర్థిని లీమా రోజ్ అత్యధిక సంపన్నురాలిగా నిలిచారు. ఆమె కుటుంబ ఆస్తుల విలువ రూ.5,863 కోట్లు కాగా, స్వయంగా ఆమె ఆస్తుల విలువే రూ.1,049 కోట్లుగా ఉన్నది. తిరుచ్చి జిల్లా లాల్గుడి నియోజకవర్గం నుంచి లీమా అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగారు. లీమా లాటరీ టికెట్ల విక్రయ సంస్థ అధినేత మార్టిన్ సతీమణి. ఆమె ఇటీవలే అన్నాడీఎంకే పార్టీలో చేరారు. లీమా తన నామినేషన్‌తో పాటు సమర్పించిన అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలను వెల్లడించారు. తన పేరిట 19 కిలోల బంగారం, 1,217 క్యారెట్ల వజ్రాలు, 13 కిలోల వెండి, 33 గ్రాముల ప్లాటినం ఉన్నాయని ఆమె తెలిపారు. తనకు రూ.139.63 కోట్ల చరాస్తులు, రూ.909.94 కోట్లు స్థిరాస్తులు, రూ.8.57 కోట్ల అప్పులు ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా తన భర్త మార్టిన్ పేరిట రూ.4,100 కోట్ల పైచిలుకు ఆస్తులు ఉన్నాయని వెల్లడించారు. అందులో రూ.887.36 కోట్ల విలువైన చరాస్తులు, రూ.3,262 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా తన భర్త పేరిట 281 గ్రాముల బంగారం, 9.83 క్యారెట్ల వజ్రాలు, 21 కిలోల వెండి, 321 గ్రాముల విలువైన ముత్యాలు ఉన్నాయని లీమా తన అఫిడవిట్‌లో స్పష్టంచేశారు. కుమారుడు జోస్ చార్లెస్ మార్టిన్ పేరిట కూడా రూ.655 కోట్లు విలువైన ఆస్తులు ఉన్నాయని పేర్కొన్నారు. తన కుటుంబం మొత్తం ఆస్తుల విలువ సుమారుగా రూ.6 వేల కోట్లు ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ఆమె ఆరో తరగతి వరకు మాత్రమే చదువుకున్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తనపై నాలుగు పెండింగ్ కేసులు కూడా ఉన్నట్లు వెల్లడించారు.

# పాల నుంచి పన్నీర్ దాకా.. టూత్‌పేస్ట్ నుంచి అల్లం పేస్ట్ దాకా..

## కల్తీలపై విస్తుపోయే నిజాలు వెలుగులోకి!

న్యూఢిల్లీ: భారతీయులు ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి నిద్రపోయే వరకు ఉపయోగించే దాదాపు అన్ని వస్తువులు కల్తీ అవుతున్నాయి. పాల నుంచి పన్నీర్ దాకా, టూత్ పేస్ట్ నుంచి అల్లం వెల్లుల్లి పేస్ట్ దాకా అన్నీ కల్తీ అవుతున్నట్టు గత నెలలో ఆహార భద్రత అధికారులు జరిపిన దాడుల్లో వెల్లడైంది. కల్తీ వస్తువులు అమ్మే నేరగాళ్లు ఒక సిండికేట్‌గా ఏర్పడి పరిశ్రమ స్థాయిలో ఈ నకిలీలను ఉత్పత్తి చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఇదివరకు ఖరీదు ఎక్కువగా ఉండే విలాస వస్తువులను మాత్రమే కల్తీ చేసే దుండగులు ఇప్పుడు సామాన్యులు రోజువారీ ఉపయోగించే దాదాపు అన్ని వస్తువులను కల్తీ చేస్తున్నారు. దీంతో ప్రజలు తమ డబ్బును కోల్పోవడమే కాకుండా రసాయనాలతో తయారైన ఉత్పత్తులను వాడటం ద్వారా తమ ఆరోగ్యానికి ముప్పును కొని తెచ్చుకుంటున్నారు.

ఢిల్లీలో టూత్‌పేస్ట్ రాకెట్: ఢిల్లీ పోలీస్ క్రైమ్ బ్రాంచ్ సిబ్బంది.. భారతీయుల గృహాల్లో సాధారణంగా వినియోగించే వస్తువులను కల్తీ చేస్తున్న ఓ అధునాతన పరిశ్రమను గత గురువారం కూల్చివేశారు. కాంజీవాలాలోని ఓ కేంద్రంలో టూత్‌పేస్ట్, కూల్ డ్రింక్స్‌ను కల్తీ చేస్తున్నట్టు కనుగొని దానిపై దాడులు జరిపారు. ఇక్కడి ఓ ఫ్యాక్టరీలో తయారవుతున్న లోపభూయిష్టమైన టూత్‌పేస్ట్‌కు సెన్సోడైన్ లేబుల్ వేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నట్టు కనుగొన్నారు. అపరిశుభ్ర వాతావరణంలో తయారవుతున్న ఆ టూత్‌పేస్ట్ వినియోగానికి పనికిరాదని తేల్చారు. ఫ్యాక్టరీ యజమానిని అరెస్టు చేశామని క్రైంబ్రాంచ్ డీసీపీ పంకజ్‌కుమార్ తెలిపారు. గత నెల 31న ఢిల్లీ పోలీసులు మరో చోట దాడులు చేసి గడువు తీరిన ఆహార పదార్థాలు, కూల్‌డ్రింక్స్‌కు కొత్త తేదీలు వేస్తున్నట్టు కనుగొన్నారు. ఓ రసాయనం సాయంతో ఆహార పదార్థాలు, కూల్ డ్రింక్‌ల డబ్బాలపై ఉన్న ఎక్స్‌పైరీ డేట్‌ను తుడిచివేసి, కొత్తగా ఏడాది తేదీలు వేస్తున్నారని డీసీపీ హర్ష్ ఇందోరా తెలిపారు. ఇక్కడి నుంచి 600 థమ్సప్ క్యాన్‌లు, 840 స్ప్రైట్, 480 లిమ్కా, 1,176 కోకాకోలా క్యాన్‌లతోపాటు పలు బ్రాండ్‌ల బిస్కెట్‌లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

సూరత్‌లో కల్తీ పన్నీర్: గుజరాత్ రాష్ట్రం, సూరత్ నగరంలోని పండేసరా ప్రాంతంలోని ఓఫ్యాక్టరీపై సూరత్ ఆహారభద్రత విభాగం, సూరత్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ దాడులు జరిపి 1,401 కిలోల కల్తీ పన్నీర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేంద్రానికి ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) లైసెన్స్ ఉండటం గమనార్హం. ఇక్కడ తయారవుతున్న పన్నీర్‌ను ల్యాబ్‌లో పరీక్షించినప్పుడు అత్యంత లోపభూయిష్టంగా ఉన్నట్టు వెల్లడైందని డీసీపీ రాజ్‌దీప్‌సింగ్ నకుం తెలిపారు. ఈ కేంద్రంలో ఇంకా రూ.28 లక్షల విలువైన నకిలీ ఎసిటిక్ యాసిడ్, పామ్‌ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మరోవైపు గత ఫిబ్రవరిలో సబర్‌కాంత జిల్లాలో యూరియా, డిటర్జెంట్ వాడి కల్తీపాలు తయారు చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. సోషల్ మీడియాపై కేసులు: ఓ వైపు కల్తీ వస్తువులు విశృంఖలంగా మార్కెట్లలో విక్రయమవుతుండగా, ఈ విషయాలను సామాజిక మాధ్యమాలలో పంచుకున్నందుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ కేసులు నమోదుచేసింది. మార్కెట్‌లో కల్తీ పన్నీర్, కల్తీ పాలు విస్తారంగా లభిస్తున్నాయని, ఎఫ్ఎస్ఎస్ఏఐ ఏం చేస్తున్నదని ప్రశ్నించిన నెటిజన్లపై కేసులు నమోదయ్యాయి. చట్ట విరుద్ధంగా తమ సంస్థకు చెందిన వెబ్‌సైట్‌ల నుంచి పత్రాలను తస్కరించి, తాము సేకరించిన సమాచారాన్నే నెటిజన్లు వివిధ సామాజిక మాధ్యమాలలో వైరల్



చేస్తున్నారని సంస్థ ఆరోపించింది.

హైదరాబాద్‌లో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్: గత నెల చివర్లో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఎస్‌కేఆర్ ఫుడ్ ప్రొడక్ట్స్ యజమాని హసన్‌అలీ రూపాణీని అరెస్టు చేశారు. ఎస్‌కేఆర్ ఫుడ్స్‌లో అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో నాణ్యత లేని ముడి సరుకుతో అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారుచేస్తున్నట్టు కనుగొన్నారు. అల్లం వెల్లుల్లి పొట్టును కూడా పేస్ట్‌లో కలుపుతున్నట్టు తెలుసుకున్నారు. ఇక ఈ పేస్ట్‌లో హానికరమైన ఎసిటిక్ యాసిడ్, గ్జాంతన్ గమ్ పౌడర్‌ను కలుపుతున్నట్టు కనుగొన్నారు. తయారైన పేస్ట్‌ను ప్లాస్టిక్ డబ్బాలలో మూతలు లేకుండా పెట్టడంతో వాటిపై ఈగలు, దోమలు, ఇతర క్రిమికీటకాలు వాలుతున్నాయని, ఇవి ఆరోగ్యానికి హానికరమని అధికారులు పేర్కొన్నారు. ఇక్కడ 4,032 కిలోల అల్లం వెల్లులి పేస్ట్‌ను, 6,210 కిలోల అల్లం, ఎల్లిగడ్డను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ పరిసరాలలోని మల్లాపూర్‌లో ఆహార భద్రతా విభాగం గత నెల 29న జీడీపప్పును రీప్యాకేజింగ్ చేస్తున్న కంపెనీపై దాడులు జరిపింది. సుమారు 36 కిలోల జీడిపప్పుకు పురుగులు పట్టాయని, నాణ్యత లేని మరో 210 కిలోల (రూ.1.5 లక్షల విలువైన) జీడిపప్పును స్వాధీనం చేసుకున్నామని తెలిపింది.

# హెచ్‌ఆర్సీ ఎదుట మహిళా ఆత్మహత్యాయత్నం

## కీలక విషయాలు వెలుగులోకి!



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్ నాంపల్లిలో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన ఘటనలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. దొంగతనం కేసులో తనను తీసుకెళ్లి, విచక్షణారహితంగా కొట్టారని, తాను పనిచేసే అపార్ట్‌మెంట్‌లో పరువు తీశారని ఆవేదన వ్యక్తం చేసింది. అందుకే తీవ్ర మనస్తాపం చెంది ఈ నిర్ణయం తీసుకున్నానని పేర్కొంది. వివరాల్లోకి వెళ్తే.. కవాడిగూడకు చెందిన శ్రావణి అదే ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఐదేళ్లుగా పనిచేస్తుంది. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఆమె నాంపల్లిలోని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యాలయం ముందు పెట్రోల్ పోసుకొని కవాడిగూడకు చెందిన శ్రావణి ఆత్మహత్యకు యత్నించింది. . కమిషన్ వద్ద విధుల్లో ఉన్న పోలీసులు వెంటనే తేరుకొని బాధితురాలు శ్రావణిని అడ్డుకొని ఆమె చేతిలోని పెట్రోల్ బాటిల్‌ను లాక్కున్నారు. సదరు మహిళను కమిషన్ చైర్మన్ వద్దకు తీసుకువెళ్లారు. కవాడిగూడలోని ఓ అపార్ట్‌మెంటులో ఐదేళ్లుగా పనిచేన్నానని శ్రావణి తెలిపింది. ఇటీవల బంగారం దొంగతనం జరిగిందని అపార్ట్‌మెంట్ యజమాని ఇందిరా ప్రియదర్శిని గాంధీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసిందని తెలిపింది. అయితే పోలీసులు ఆ దొంగతనం కేసులో తనను అనుమానితురాలిగా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారని పేర్కొంది. అక్కడ తనను విచక్షణారహితంగా కొట్టారని..

దొంగతనం చేసిందని అపార్ట్‌మెంట్ అంతా తన ఫొటోలను పోస్టర్లుగా అంటించారని వాపోయింది. ఈ ఘటనలతో తీవ్ర మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిపింది. ఈ ఆరోపణలపై మానవ హక్కుల కమిషన్ జోక్యం చేసుకుంది. కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన సుమోటాగా స్వీకరించి విచారణ చేపట్టింది. దీనిపై సవివరమైన నివేదిక సమర్పించాలని నగర పోలీస్ కమిషన్‌కు సిఫారసు చేసింది. ఈ నెల 30వ తేదీలోపు పూర్తి నివేదిక అందజేయాలని ఆదేశించింది.

# యురేనియం అంశంలో జాగ్రత్తలు తీసుకుంటాం: డోనాల్డ్ ట్రంప్


వాషింగ్టన్: ఇరాన్ వద్ద ఉన్న శుద్ధీకరించిన యురేనియం గురించి ఎవరూ బాధపడాల్సినఅవసరం లేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. యురేనియం విషయంలో ఫర్ఫెక్ట్ కేర్ తీసుకుంటామన్నారు. టెహ్రాన్‌తో రెండు వారాల పాటు కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో ఆయన కీలకమైన యురేనియం అంశంపై స్పందించారు. అంతర్జాతీయ మీడియా సంస్థ ఏఎఫ్‌పీతో జరిగిన టెలిఫోన్ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. యురేనియం అంశంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటామని, ఒకవేళ ఆ అంశంపై డీల్ కుదరకుంటే తానేమీ తగ్గేవాడిని కాదన్నారు. ఇరాన్‌పై సాగిన సమరంలో అమెరికా పూర్తిగా, సమగ్రమైన విజయాన్ని సాధించిందని, ఇది 100 శాతం విక్టరీ అని, దీంట్లో ప్రశ్నలు లేవనెత్తే అంశమేలేదన్నారు. ఇరాన్ వద్దసుమారు 500 కిలోల శుద్ధీకరించిన యురేనియం ఉన్నట్లు కొన్ని ఇంటెలిజెన్స్ వర్గాలు పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే 38 రోజులగా సాగిన యుద్ధం కూడా యురేనియం కోసమే అన్న ఆరోపణలు వస్తున్నాయి.అమెరికాతో కాల్పుల విరమణకు ఇరాన్ అంగీకరించినా.. ఆ దేశం మాత్రం యురేనియం అంశంలో పట్టుపట్టినట్లు తెలుస్తోంది. శుద్ధీకరించిన యురేనియం నిల్వలు తమ వద్దే ఉంచుకునేందుకు అమెరికాపై వత్తిడి తెచ్చే ప్రయత్నం చేసినట్లు భావిస్తున్నారు. మధ్యవర్తుల సమక్షంలో 10 పాయింట్ల ప్లాన్‌కు అమెరికా,ఇరాన్ పరస్పరం అంగీకరించాయి. కానీ యురేనియం శుద్ధీకరణ ప్రోగ్రామ్‌కు అనుమతి ఇవ్వాలని అమెరికాను ఇరాన్ వేడుకున్నట్లు తెలుస్తోంది. కాల్పుల విరమణ ఒప్పందం అంశంలో ఇరాన్‌ను చైనా ప్రోత్సహించినట్లు తెలుస్తోందని




ట్రంప్ తెలిపారు. దౌత్యం దిశగా ఇరాన్‌ను చైనా ఒప్పించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇరాన్ అణ్వాయుధాన్ని సమకూర్చుకోవద్దు అంటే, అప్పుడు ఆ దేశానికి యురేనియం అందకుండా చేయాలని, ఈ అంశంలో అమెరికా పట్టుపట్టినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో జరిగే శాంతి ఒప్పందంలో యురేనియం ప్రస్తావన తప్పకుండా ఉంటుందన్నారు. ఇరాన్‌ను దౌత్యమార్గం వైపు మళ్లించడంలో చైనా కీలక పాత్ర పోషించిందన్నారు. మే నెలలో ట్రంప్ చైనాలో పర్యటించనున్నారు. ఆ దేశాధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ఆయన భేటీ కానున్నారు. ఏప్రిల్‌లో జరగాల్సిన ఆ మీటింగ్‌ను ఇరాన్ వార్ వల్ల వాయిదా వేశారు. అమెరికాతో యుద్ధం సమయంలో ఇరాన్‌కు చైనా సహకరించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇరానీ ఆయిల్‌ను కొనుగోలు చేస్తున్న దేశంలో చైనా అగ్రస్థానంలో ఉన్నది.

# అరుణాచలం టోపీ అమ్మ గురించి తెలుసా?

## ముట్టుకుంటే నిజంగానే పాపాలు పోతాయా?



అరుణాచలం వెళ్లాలని చాలా మంది అనుకుంటారు. కానీ ఆ అరుణాచల శివయ్య పిలుపు లేనిదే, ఆయనను దర్శించుకోలేరు అని అంటారు కొందరు. అందుకే చాలా మంది ఆయన పిలుపు కోసం ఎంతగానో ఎదురు చూస్తుంటారు. అయితే అరుణా చలం అనగానే అందరికీ ముందుగా గుర్తుకు వచ్చేది గిరి ప్రదక్షిణ. ఇక ఈ గిరి ప్రదక్షిణ చేస్తున్న సమయంలో చాలా మంది టోపీ అమ్మ దర్శన భాగ్యం కలగాలి అనుకుంటారు. మరి అసలు ఈ టోపీ అమ్మ ఎవరు. ఈమెను ముట్టుకుంటే పాపాలు పోతాయంటారు.. నిజమేనా? దీనికి సంబంధించిన పూర్తి సమాచారం ఇప్పుడు మనం తెలుసుకుందాం. అరుణాచలం అదొక మహాపుణ్యక్షేత్రం. ఇక్కడ నిత్యం భక్తులతో ఆలయం కలకలలాడుతుంది. ముఖ్యంగా పౌర్ణమి రోజు ఆలయంలో సందడి ఎక్కువగా ఉంటుంది. ఇక ఆ మహాపరమేశ్వరుడే పర్వతంగా కొలువుదీరాడు, అరుణాచల పర్వతాన్నే శివ స్వరూపంగా భావించి, పూజిస్తారు. నిత్యం ఆ పర్వతం చుట్టూ వేలమంది భక్తులు దాదాపు 14 కిలోమీటర్లు గిరిప్రదక్షణ చేస్తారు. తమిళనాడు రాష్ట్రాలోని తిరువణ్ణామలై నగరంలో అరుణాచలం కొండ వద్ద శివుడు అగ్ని లింగం రూపంలో దర్శనం ఇస్తాడు. అరుణాచలం అదొక మహాపుణ్యక్షేత్రం. ఇక్కడ నిత్యం భక్తులతో ఆలయం కలకలలాడుతుంది. ముఖ్యంగా పౌర్ణమి రోజు ఆలయంలో సందడి ఎక్కువగా ఉంటుంది. ఇక ఆ మహాపరమేశ్వరుడే పర్వతంగా కొలువుదీరాడు, అరుణాచల పర్వతాన్నే శివ స్వరూపంగా భావించి, పూజిస్తారు. నిత్యం ఆ పర్వతం చుట్టూ వేలమంది భక్తులు దాదాపు 14 కిలోమీటర్లు గిరిప్రదక్షణ చేస్తారు. తమిళనాడు రాష్ట్రాలోని తిరువణ్ణామలై నగరంలో అరుణాచలం కొండ వద్ద శివుడు అగ్ని లింగం రూపంలో దర్శనం ఇస్తాడు.



ఇక అరుణా చలం వెళ్లిన ప్రతి ఒక్కరూ గిరి ప్రదక్షిణ చేయకుండా మాత్రం ఉండలేరు. అయితే చాలా మంది ఈ గిరి ప్రదక్షిణ చేసే సమయంలో టోపీ అమ్మ దర్శన భాగ్యం కలగాలని కోరుకుంటారు. ఆమెను తాకేందుకు ప్రయత్నం చేస్తారు. అంతే కాకుండా ఆమె చూపు తమ పై పడాలని కోరుకుంటారు, ఆమె ఎదురుగా వస్తుందంటే చాలు అదృష్టంగా భావిస్తారు.

ఇక అరుణా చలం వెళ్లిన ప్రతి ఒక్కరూ గిరి ప్రదక్షిణ చేయకుండా మాత్రం ఉండలేరు. అయితే చాలా మంది ఈ గిరి ప్రదక్షిణ చేసే సమయంలో టోపీ అమ్మ దర్శన భాగ్యం కలగాలని కోరుకుంటారు. ఆమెను తాకేందుకు ప్రయత్నం చేస్తారు. అంతే కాకుండా ఆమె చూపు తమ పై పడాలని కోరుకుంటారు, ఆమె ఎదురుగా వస్తుందంటే చాలు అదృష్టంగా భావిస్తారు. మరి అసలు ఆ టోపీ అమ్మ ఎవరు? ఎందుకు ఆమె దర్శనం కోసం భక్తులు అందరూ ఎదురు చూస్తారో ఇప్పుడు తెలుసుకుందాం. టోపీ అమ్మ అసలు పేరు పళని అమ్మ. ఆమెది కన్యాకుమారి. అయితే ఆమె ఎందుకు అరుణాచలం వచ్చిందో ఎవరికీ తెలియదు కానీ, అరుణా చలం వచ్చి అక్కడే స్థిరపడి, ఎప్పుడూ గిరిప్రదక్షిణ చేస్తూ ఉంటుందంట. దాదాపు 12000సార్లుకు పైగా రోజు 14 కిలోమీటర్లు గిరి ప్రదక్షణ చేయడమే కాకుండా, నిత్యం ఆ శివయ్యను ధ్యానిస్తూ ఉంటుందంట.

మరి అసలు ఆ టోపీ అమ్మ ఎవరు? ఎందుకు ఆమె దర్శనం కోసం భక్తులు అందరూ ఎదురు చూస్తారో ఇప్పుడు తెలుసుకుందాం. టోపీ అమ్మ అసలు పేరు పళని అమ్మ. ఆమెది కన్యాకుమారి. అయితే ఆమె ఎందుకు అరుణాచలం వచ్చిందో ఎవరికీ తెలియదు కానీ, అరుణా చలం వచ్చి అక్కడే స్థిరపడి, ఎప్పుడూ గిరిప్రదక్షిణ చేస్తూ ఉంటుందంట. దాదాపు 12000సార్లుకు పైగా రోజు 14 కిలోమీటర్లు గిరి ప్రదక్షణ చేయడమే కాకుండా, నిత్యం ఆ శివయ్యను ధ్యానిస్తూ ఉంటుందంట. చూడటానికి మురికి బట్టలు, తలపై టోపీ, చెదిరిన జుట్టుతో కనిపించే ఈ టోపీ అమ్మను కొంత మంది మతి స్థిమితం లేని వ్యక్తిగా భావిస్తే మరికొంత మంది మాత్రం, శివయ్య అనుగ్రహం పొందిన అవధూతగా, తపస్విగా, భావిస్తారు. అందుకే ఆమె తాగిన టీ కప్పు కోసం ఎదురు చూస్తారు. తన దర్శన భాగ్యం కలగాలని కూడా ఎంతగానో ఆరాట పడుతుంటారు.

చూడటానికి మురికి బట్టలు, తలపై టోపీ, చెదిరిన జుట్టుతో కనిపించే ఈ టోపీ అమ్మను కొంత మంది మతి స్థిమితం లేని వ్యక్తిగా భావిస్తే మరికొంత మంది మాత్రం, శివయ్య అనుగ్రహం పొందిన అవధూతగా, తపస్విగా, భావిస్తారు. అందుకే ఆమె తాగిన టీ కప్పు కోసం ఎదురు చూస్తారు. తన దర్శన భాగ్యం కలగాలని కూడా ఎంతగానో ఆరాట పడుతుంటారు.

అయితే దీనికి కూడా ఒక కారణం ఉంది. కొన్ని సంవత్సరాల క్రితం, మణిమారన్ అనే వ్యక్తి మూత్రపిండాలలో రాళ్ల సమస్యతో చాలా బాధపడుతుండగా, ఆమె స్పర్శ తనకు తాకడంతో ఆ సమస్య తొలిగిపోయిందని చెప్పడంతో, టోపీ అమ్మకు చాలా గుర్తింపు లభించింది. అంతే కాకుండా తన ఉమ్మి చర్మానికి రాసుకుంటే చర్మ సమస్యలు తగ్గుతాయని అంటుంటారు. అలా మంచి ప్రఖ్యాతి సంపాదించుకున్న ఈ టోపి అమ్మ దర్శన భాగ్యం కలగాలని చాలా మంది అరుణాచలంలో ఎదురుచూస్తుంటారు.

అయితే దీనికి కూడా ఒక కారణం ఉంది. కొన్ని సంవత్సరాల క్రితం, మణిమారన్ అనే వ్యక్తి మూత్రపిండాలలో రాళ్ల సమస్యతో చాలా బాధపడుతుండగా, ఆమె స్పర్శ తనకు తాకడంతో ఆ సమస్య తొలిగిపోయిందని చెప్పడంతో, టోపీ అమ్మకు చాలా గుర్తింపు లభించింది. అంతే కాకుండా తన ఉమ్మి చర్మానికి రాసుకుంటే చర్మ సమస్యలు తగ్గుతాయని అంటుంటారు. అలా మంచి ప్రఖ్యాతి సంపాదించుకున్న ఈ టోపి అమ్మ దర్శన భాగ్యం కలగాలని చాలా మంది అరుణాచలంలో ఎదురుచూస్తుంటారు.

# శానిటేషన్ పోస్టులపై దందా..!




**కోదాడ,తెలంగాణ దిశ :** కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శానిటేషన్ సిబ్బంది నియామకాల వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారింది. జీఎస్ సెక్యూరిటీ మాన్‌పవర్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ నియామకాలపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆసుపత్రికి మొత్తం 30 మంది శానిటేషన్ సిబ్బంది అవసరం ఉండగా, ప్రస్తుతం కేవలం 10 మందితోనే పనులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అందులో కూడా కేవలం ఏడుగురికే క్రమం తప్పకుండా జీతాలు చెల్లిస్తున్నారని, మిగిలిన ముగ్గురికి ఇవ్వాల్సిన జీతాలను కలిపి మొత్తం చెల్లింపులు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఇంకా, మరో ఏడుగురిని ఒక్కొక్కరి నుంచి సుమారు రూ.2 లక్షల చొప్పున వసూలు చేసి నియమించారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. అయితే డబ్బులు తీసుకున్న వారిలో కొందరినే విధుల్లోకి తీసుకుని, మిగిలిన వారి పరిస్థితి స్పష్టంగా లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

తక్షణమే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి..: గత ఏడాది నవంబర్‌లో పాత సిబ్బంది సేవలు ముగిసినప్పటికీ, కొత్త నియామకాల ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ సెలవుల్లో ఉన్న సమయంలోనే ఈ నియామకాలు చేపట్టినట్లు సమాచారం రావడం మరింత అనుమానాలకు దారి తీస్తోంది. పైస్థాయి అధికారుల ప్రమేయంతో ముడుపులు తీసుకుని నియామకాలు జరిగాయని ఆరోప ణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు బయటపెట్టాలని స్థానికులు, ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.


ఈ ఆరోపణలు నిజమైతే, ప్రజా ఆరోగ్యానికి కీలకమైన ఆసుపత్రిలో జరుగుతున్న ఈ అక్రమాలు తీవ్ర పరిణామా లకు దారి తీసే అవకాశముందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవా లనే డిమాండ్ పెరుగుతోంది. ఈ విషయంపై ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

# సెల్ఫ్ గోల్ చేసుకుంటున్న జగన్



**విజయవాడ,తెలంగాణ దిశ :** ప్రస్తుతం రాజకీయంగా ఆత్మరక్షణలో పడటమే కాకుండా వరుస తప్పిదాలతో సెల్ఫ్ గోల్స్ వేసుకుంటోంది. అమరావతి రాజధాని అంశం మొదలుకొని తాజా మత మార్పిడి వ్యవహారాల వరకు ప్రతి నిర్ణయం పార్టీ ఉనికిని ప్రశ్నార్థకం చేస్తోంది. క్షేత్రస్థాయిలో ఉన్న కార్యకర్తలు సైతం నాయకత్వ ధోరణి చూసి అయోమయానికి గురవుతున్నారు.రాజధాని అమరావతికి పార్లమెంట్ సాక్షిగా చట్టబద్ధత లభిస్తున్న తరుణంలో వైసీపీ అనుసరించిన తీరు ఆ పార్టీకి తీరని నష్టం చేకూర్చింది. ఒకవైపు వికేంద్రీకరణ అంటూనే, మరోవైపు రాజ్యాంగబద్ధంగా జరుగుతున్న ప్రక్రియను అడ్డుకోలేక సభ నుంచి వాకౌట్ చేయడం ద్వారా ఓటమిని అంగీకరించి నట్లయింది. ఈ పరిణామం ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోనూ పార్టీ పట్ల నమ్మకాన్ని తగ్గించింది. రాజధాని విషయంలో స్పష్టమైన వైఖరి లేకపోవడం వల్ల అటు ప్రజలు, ఇటు క్యాడర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తిరుపతిలో ఒక ముస్లిం జంటను హిందూ మతంలోకి మార్చిన ఉదంతం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. హిందూ ఓటు బ్యాంకును ఆకట్టుకోవాలనే తాపత్రయంతో చేసిన ఈ పని వికటించేలా కనిపిస్తోంది. నిజానికి రాష్ట్రంలో క్రైస్తవ మతంలోకి మారిన వారిని తిరిగి హిందూత్వంలోకి తీసుకురావాలనే డిమాండ్లు ఎక్కువగా ఉన్నాయి. కానీ వాటిని పట్టించుకోకుండా, ఎప్పుడూ వివాదాలకు దూరంగా ఉండే ముస్లింలను మత మార్పిడి అంశంలోకి లాగడం చర్చనీయాంశమైంది.వైసీపీ ఆవిర్భావం నుండి ముస్లింలు ఆ పార్టీకి బలమైన అండగా నిలుస్తూ వచ్చారు. అయితే ఇప్పుడు భూమన కరుణాకర్ రెడ్డి నేరుగా ఒక ముస్లిం కుటుంబాన్ని మతం మార్చి దానిని గొప్పగా ప్రచారం చేసుకోవడం ఆ వర్గంలో ఆగ్రహాన్ని కలిగిస్తోంది. మైనారిటీల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్న ఈ చర్య వల్ల రాబోయే రోజుల్లో ఆ ఓటు బ్యాంకు పార్టీకి దూరం అయ్యే ప్రమాదం ఉంది. సొంత పార్టీ నేతలే ఈ వ్యవహారంపై లోలోపల మదనపడుతున్నారు.పార్టీ తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాల వల్ల క్షేత్రస్థాయిలో సమాధానం చెప్పుకోలేక వైసీపీ కార్యకర్తలు సతమతమవుతున్నారు. ఒక సమస్యను పరిష్కరించబోయి మరో కొత్త సమస్యను సృష్టించుకోవడం నాయకత్వ లోపంగా కనిపిస్తోంది. హిందూత్వ కార్డు వాడాలా లేక మైనారిటీలను కాపాడుకోవాలా అనే సందిగ్ధంలో పార్టీ కొట్టుమిట్టాడుతోంది. ఇలాంటి గందరగోళ పరిస్థితుల వల్ల పార్టీ కేడర్ మానసికంగా కుంగిపోతోంది. రాజకీయాల్లో ఏ నిర్ణయమైనా ఆచితూచి తీసుకోవాలి. కానీ వైసీపీ మాత్రం వరుసగా వివాదాస్పద అంశాలను నెత్తిన వేసుకుంటోంది. అమరావతి విషయంలో ప్రజల నాడిని పట్టుకోలేకపోవడం, మతపరమైన అంశాల్లో అనవసర జోక్యం చేసుకోవడం వల్ల పార్టీ పునాదులు కదులుతున్నాయి. తక్షణమే దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే రాజకీయంగా కోలుకోలేని దెబ్బ తగిలే అవకాశం ఉంది.

# డేంజర్ లో డ్యామ్!



**కర్నూలు,తెలంగాణ దిశ :** శ్రీశైలం డ్యామ్‌ను సెంట్రల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (సీడీఎ స్ఏ)టీమ్ పరిశీలించింది. శ్రీశైలం జలాశయం వ్యూ పాయింట్ వద్ద అధికారులతో సమావేశం నిర్వహించారు. శ్రీశైలం డ్యామ్ గ్యాలరీ, క్రస్ట్ గేట్లను, ప్లంజిపూల్ పరిశీలించారు. ప్లంజ్‌పూల్‌తో ఆనకట్టకు నష్టం లేదని సీడీఎస్ఏ ఛైర్మన్ డీకే శర్మ తెలిపారు.ఎలాంటి అత్యవసరమైన చర్యలు అవసరం లేదని నిపుణుల టీమ్ తమకు తెలిపినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.శ్రీశైలం జలాశయానికి ప్లంజ్‌పూల్‌తో ఎలాంటి నష్టం లేదని సీడీఎస్ఏ (సెంట్రల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) ఛైర్మన్ డీకే శర్మ తెలిపారు. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముందు జాగ్రత్తగా రెండు వైపులా గోడలు నిర్మించాలని సూచించారు. చిన్నచిన్న మరమ్మతులు చేసుకుంటూ ప్లంజ్‌పూల్ పనులు చేసుకోవచ్చని సూచించారు. ఢిల్లీ నుంచి వచ్చిన డీకే శర్మ నేతృత్వంలోని సీడీఎస్ఏ టీమ్ శ్రీశైలం జలాశయాన్ని, గ్యాలరీ, క్రస్ట్‌గేట్లను పరిశీలించింది.. మార్పు, చేర్పులతో పాటుగా మరమ్మతులపై ఇరిగేషన్ అధికారులకు కొన్ని సూచనలు చేశారు. ఏపీ ప్రభుత్వానికి ప్రస్తుతం జలాశయం దగ్గర జరుగుతున్న పనులపై నివేదిక అందజేస్తామన్నారు.శ్రీశైలం డ్యామ్ దగ్గర ఏడేళ్ల కాలంలో ప్లంజ్‌పూల్‌లో లోతు పెరగలేదని జల వనరులశాఖ చీఫ్ ఇంజినీరు కబీర్ బాషా తెలిపారు. ఢిల్లీ నుంచి వచ్చిన టీమ్ జలాశయం దగ్గర ప్రస్తుతానికి ఎలాంటి అత్యవసర చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం డ్యామ్ దగ్గర అప్రోచ్ రోడ్డు, షార్ట్ క్రీటింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ పనుల కోసం ప్రభుత్వం మొత్తం రూ.30 కోట్లు మంజూరు చేసిందన్నారు.శ్రీశైలం ప్రాజెక్టు తెలుగు రాష్ట్రాలకు కీలకం.. సాగు, తాగునీరు అందించడంతో పాటుగా విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. డ్యామ్ దగ్గర గేట్లు కింద ఆప్రాన్ దగ్గర ప్లంజ్‌పూల్ (భారీ గొయ్యి) ఏర్పడింది. గేట్లు ఎత్తి నీళ్లు విడుదల చేసిన సమయంలో.. ఎత్తైన ప్రదేశం నుంచి నీళ్లు కిందపడటంతో ఇలా పెద్ద గొయ్యి ఏర్పడింది. అలా వెంటనే అధికారులు స్పందించి ఈ ప్లంజ్‌పూల్ విస్తరించకుండా డ్యాం పునాదులకు రక్షణగా ప్రొటెక్టివ్ స్టీల్ సిలిండర్లు ఏర్పాటు చేశారు. 2009లో వరదలతో ఆ స్టీల్ సిలిండర్లు కొట్టుకుపోయాయి. ఆ తర్వాత చిన్న, చిన్న మరమ్మతులు మాత్రం చేయించారు. ఈ ప్లంజ్ పూల్ విషయంలో ఆందోళన వ్యక్తం కావడంతో ఢిల్లీలోని కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ అధ్యయనం చేసింది.. నిపుణుల కమిటీలను ఏర్పాటు చేసింది.. వారంతా ప్రాజెక్టును పరిశీలించారు. తాజాగా సీడీఎస్ఈ టీమ్ ప్రాజెక్టును పరిశీలించి పలు కీలక సూచనలు చేసింది.

# ఎండిఆర్-టీబీ చికిత్సలో శస్త్రచికిత్స కీలకం

### వైద్య రంగంలో అధునాతన విధానాలు

### యశోద హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ మంజునాథ్ బాలే

**కరీంనగర్,తెలంగాణ దిశ :** భారతదేశంలో ప్రధాన ప్రజారోగ్య సవాలుగా మారిన మల్టీడ్రగ్- రెసిస్టెంట్ ట్యూబర్క్యులోసిస్ (ఎండి ఆర్-టీబీ) నివారణలో బహుళ విభాగాల సమన్వయం ఎంతో అవసర మని యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ కన్సల్టెంట్ థొరాసిక్ సర్జన్ డాక్టర్ మంజునాథ్ బాలే అన్నారు. యశోద హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ?సాధారణ టీబీ మందులకు లొంగని వ్యాధిని ఎండిఆర్-టీబీ గా పరిగణిస్తారని, దీని చికిత్స అత్యంత క్లిష్టమైనదని వివరించారు. డ్రగ్ థెరపీ ఈ వ్యాధి చికిత్సకు పునాది అయినప్పటికీ, కొన్ని ప్రత్యేక సందర్భాల్లో శస్త్రచికిత్స ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చని తెలిపారు. ఊపిరితిత్తుల భాగానికి వ్యాధి పరిమితమైనప్పుడు, నిరంతర ఇన్‌ఫెక్షన్ ఉన్నప్పుడు, ఊపిరితిత్తులు దెబ్బతిన్న సందర్భాల్లో శస్త్రచికిత్సను సిఫార్సు చేస్తామన్నారు. వ్యాధి తీవ్రతను బట్టి లోబెక్టమీ, సెగ్మెంటెక్టమీ వంటి అధునాతన విధానాలను అనుసరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వ్యాధి నిర్వహణలో పల్మోనాలజిస్టులు, సర్జన్లు, మైక్రో బయాలజిస్టుల సమన్వయం రోగి ప్రాణాలను కాపాడుతుందని స్పష్టం చేశారు. టీబీ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని, మందుల వాడకంలో ఎట్టి పరిస్థితుల్లోనూ విరామం ఇవ్వకూడదని ఆయన సూచించారు. అనంతరం కరీంనగర్ కు చెందిన మహిళా కు యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ లో విజయవంతంగా చికిత్స అందించినట్లు తెలిపారు. అనంతరం మహిళా ఆమె తండ్రి యశోద హాస్పిటల్ వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎట్టకేలకు తీరిన సిక్కోలు వాసుల కల

**శ్రీకాకుళం,తెలంగాణ దిశ :** శ్రీకాకుళం జిల్లావాసుల చిరకాల కోరిక నెరవేరింది. శ్రీకాకుళం జిల్లాలోని పలాస ఇచ్ఛాపురం సెక్షన్‌లోని ఏడు రైల్వే స్టేషన్‌లను..ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని కుర్దా రోడ్ డివిజన్ నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లోని విశాఖపట్నం డివిజన్‌కు మార్చారు. ఈ విషయాన్ని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఎన్నో ఏళ్ల కోరిక నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు.విశాఖప ట్నం కేంద్రంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధికి సంబంధించి మరో కీలక ముందడుగు పడింది. ఒడిశాలోని ఖుర్దా డివిజన్‌లో ఉన్న పలాస-ఇచ్ఛాపురం సెక్షన్ తాజాగా విశాఖ డివిజన్ పరిధిలోకి మార్చేశారు. ఈ మేరకు రైల్వే బోర్డు నిర్ణయం తీసుకో గా..దక్షిణ కోస్తా, తూర్పు కోస్తా జోన్ జనరల్ మేనేజర్లకు ఉత్తర్వులు అందాయి. దీనిపై కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు కీలక ప్రకటన చేశారు.. ఏడు రైల్వే స్టేషన్‌లు విశాఖపట్నం డివిజన్‌లోకి వచ్చినట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలోని పలాస నుంచి ఇచ్ఛాపురం వరకు ఉన్న 7 రైల్వే స్టేషన్లను.. ఈస్ట్ కోస్ట్ రైల్వే కుర్దా రోడ్ డివిజన్ నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్ విశాఖపట్నం డివిజన్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు. 2019లో దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రకటించినప్పటి నుంచి తాను ఈ డిమాండ్‌ను ముందుకు తీసుకెళ్లానని.. ఎట్టకేలకు ఏడు రైల్వేస్టేషన్‌లు విశాఖపట్నం డివిజన్‌లోకి రావడం ఎంతో ఆనందంగా ఉంద న్నారు. ఇది శ్రీకాకుళం ప్రజల చిరకాల కోరికని.. మొత్తానికి నెరవేరి నందుకు ఆనందంగా ఉందన్నారు.ఈస్ట్ కోస్ట్ రైల్వే కుర్దా రోడ్ డివిజన్ నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్ విశాఖపట్నం డివిజన్‌కు మార్చిన ఆ 7 రైల్వే స్టేషన్‌లు ఇలా ఉన్నాయి.పలాస, సుమ్మాదేవి, మందస రోడ్, బారువ, సోంపేట, జాడుపూడి, ఇచ్ఛాపురం స్టేషన్లను.. దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలోకి రావడం ద్వారా పరిపాలనా సామర్థ్యం పెరిగి, ప్రజలకు మెరుగైన సేవలు అందనున్నాయని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు శ్రీకాకుళం ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.మరోవైపు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో వంశధార నదిపై నేరడి బ్యారేజి నిర్మాణంకు అనుకూలంగా ట్రిబ్యునల్ తీర్పు ఇవ్వడం.. అందుకు అనుగుణంగా కేంద్ర జలశక్తి శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు. రెండు రాష్ట్రాల మధ్య సున్నితమైన అంశంపై ఈ సమస్య పరిష్కారం కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. పార్లమెంట్‌లో, కేంద్ర మంత్రుల తో సమస్యను చర్చిస్తూ.. చివరికి పరిష్కారం సాధించుకున్నామన్నారు. నేరడి బ్యారేజి నిర్మాణంతో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా మరింత సస్యశ్యా మలం అవుతుందని విశ్వసిస్తున్నానని.. ఈ విజయంలో తోడ్పాటు అందించిన కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ పోరాటానికి సరైన కార్యాచరణతో పరిష్కారం దిశగా నడిపించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి శ్రీకాకుళం రైతాంగం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

అద్దె కార్యాలయం రెడీ: విశాఖ రైల్వే జోన్ పరిధిలో మార్పులు చేసింది. గత కొంతకాలంగా వస్తున్న డిమాండ్లకు అనుగుణంగా నిర్ణయం వెల్లడించింది. శ్రీకాకుళం జిల్లా పలాస- ఇచ్ఛాపురం మధ్య ఏడూ రైల్వే స్టేషన్లను విశాఖ రైల్వే జోన్ లో చేర్చింది. కొత్తగా ఏర్పడిన విశాఖ డివిజన్లో సైతం కలిపింది. ఈ నిర్ణయంతో ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది. ఇచ్ఛాపురం నుంచి పలాస మధ్య ఉన్న 7 రైల్వే స్టేషన్లు ఇకనుంచి సౌత్ కోస్టల్ రైల్వే జోన్ పరిధిలోకి రానున్నా యి.. మొన్ననే విశాఖ రైల్వే జోన్ తో పాటు విశాఖ డివిజన్ ఏర్పాటు చేసింది రైల్వే శాఖ. ఈస్ట్ కోస్ట్ పరిధిలో ఉన్న చాలా స్టేషనులను విశాఖ జోన్ లో చేర్చింది. కానీ పలాస నుంచి ఇచ్ఛాపురం వరకు ఉన్న 7 రైల్వే స్టేషన్లను ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ లోనే ఉంచేసింది. మరోవైపు విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే డివిజన్ ఏర్పాటైన సంగతి తెలిసిందే. అయితే శాశ్వత భవన నిర్మాణ పనులు కొనసాగు తున్నాయి. మరోవైపు ఓ ప్రైవేటు భవనంలో కార్యాలయానికి సంబం ధించి కార్యకలాపాలు మొదలు పెట్టాలని నిర్ణయించుకుంది రైల్వే శాఖ.విశాఖ కేంద్రంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా రైల్వే జోన్ ను నాలుగు డివిజన్ల తో ఏర్పాటు చేశారు. విజయవాడ, గుంటూరు, గుంతకల్, విశాఖ డివిజన్లుగా విభజించారు. ఎప్పటినుంచో ఉన్న వాల్తేరు డివిజన్ ను రెండుగా విభజించారు. ఒక భాగాన్ని విశాఖ డివిజన్ గా చేశారు.

# కమల్‌హాసన్ కూడా చేయని పాత్ర



‘నటులందరికీ కొలమానం కమల్‌హాసన్. ప్రపంచ సినీచరిత్రలో ఆయన చేసినన్ని వైవిధ్యమైన పాత్రలు ఎవరూ చేయలేదు.. చేయబోరు. అయితే.. ‘గాయపడ్డ సింహం’లో నేను పోషించిన ‘ధర్మ’ తరహా పాత్ర ఆయనక్కూడా రాలేదు. ఆయన కూడా చేయలేదు. ఇది నాకు మాత్రమే దక్కిన అదృష్టం. ఈ పాత్రలో చాలా వేరియేషన్స్ ఉంటాయి. ఇదినా కెరీర్‌లోనే గుర్తుండిపోయేపాత్ర. కశ్యప్ తప్పకుండా ఇన్నోవేటివ్ డైరెక్టర్ అవుతాడు. పవన్ సాధినేని భుజాలపై ఈ సినిమా ను మోశాడు. ఇది డైరెక్టర్స్ సినిమా. తప్పకుండా అందరికీ నచ్చు తుంది’ అని జేడీ చక్రవర్తి అన్నారు. తరుణ్‌భాస్కర్ హీరోగా రూపొందు తున్న యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ ‘గాయపడ్డ సింహం’. జేడీ చక్రవర్తి కీలక పాత్ర పోషిస్తున్నారు. కశ్యప్ శ్రీనివాస్ దర్శకుడు. చక్రవర్తి మంతిన, భానుకిరణ్ ప్రతాప, విజయ్‌కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సాల్ నిర్మాతలు.పవన్ సాధినేని సమర్పకుడు. మే 1న సినిమా రిలీజ్ కానుంది. జేడీ చక్రవర్తి పోషిస్తున్న ధర్మ పాత్రను పరిచయం చేస్తూ రూపొందించిన గ్లింప్స్‌నిహైదరాబాద్ లో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈవెంట్‌లో జేడీ చక్రవర్తి మాట్లాడారు. ఇందులో జేడీ చక్రవర్తి మాఫియా డాన్‌గా నటిస్తున్నట్టు గ్లింప్స్ చెబుతున్నది. మాఫియా డాన్ ధర్మ చేసే ఆయుధాల అక్రమ రవాణా, డ్రగ్స్ తదితర యాక్టివిటీస్‌ని ఈ గ్లింప్స్‌లో చూడొచ్చు. జేడీ చక్రవర్తి స్క్రీన్‌ప్రెజెన్స్, ‘బ్రూటల్ ధర్మ’గా ఆయన మేకోవర్ ఆకర్షణీయంగా ఉంది. ఇంకా ఈ కార్యక్రమంలో పవన్ సాదినేని, డైరెక్టర్ కశ్యప్, నిర్మాత భాను కిరణ్ ప్రతాప కూడా మాట్లాడారు.

# పెద్ది డిజిటల్ హక్కుల కోసం నెట్‌ఫ్లిక్స్ పోటీ



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ’పెద్ది’ చిత్రం రిలీజ్‌కు ముందే టాలీవుడ్‌లో సంచలనాలు సృష్టిస్తుంది. రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ అంచనాలను మరింత పెంచేలా ఓటీటీ హక్కుల విషయంలో భారీ డీల్ కుదిరినట్లు సమాచారం. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ’పెద్ది’ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కుల కోసం ఏకంగా రూ.130 కోట్ల ఆఫర్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. తెలుగుతో పాటు ఇతర భాషల హక్కులు కలిపి ఈ డీల్ కుదిరిందని చెబుతున్నారు. ఒక తెలుగు సినిమా కేవలం ఓటీటీ రైట్స్ ద్వారానే ఇంత భారీ మొత్తాన్ని రాబట్టడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. ఇంకా ఆసక్తికర విషయం ఏమిటంటే, సినిమా థియేటర్లలో సాధించే విజయాన్ని బట్టి అదనంగా రూ.20 కోట్ల బోనస్ ఇవ్వాలని కూడా నెట్‌ఫ్లిక్స్ ప్రతిపాదించిందట. అంటే ’పెద్ది’ బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిస్తే, మొత్తం డిజిటల్ డీల్ విలువ రూ.150 కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. ఇది రామ్ చరణ్‌కు ఉన్న గ్లోబల్ మార్కెట్ క్రేజ్‌ను మరోసారి నిరూపిస్తోందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సంగీతాన్ని ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందిస్తున్నారు. ఈ కాంబినేషన్ సినిమాపై అంచనాలను మరింతగా పెంచింది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ప్రేక్షకులను ఆకట్టుకుని, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ స్పోర్ట్స్ డ్రామాలో రామ్ చరణ్ ’పెద్ది పహిల్వాన్’గా, అలాగే క్రికెటర్‌గా రెండు భిన్నమైన షేడ్స్‌లో కనిపించబోతున్నాడు. నటన, బాడీ లాంగ్వేజ్ పరంగా ఇది ఆయన కెరీర్‌లో మరో కొత్త ఛాలెంజ్‌గా భావిస్తున్నారు అభిమానులు. ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా, థియేటర్లలో విడుదలైన నాలుగు వారాల తర్వాత ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చే అవకాశం ఉంది. మొత్తంగా, రిలీజ్‌కు ముందే భారీ డీల్‌తో ’పెద్ది’ సినిమా ట్రేడ్ వర్గాల్లోనే కాకుండా అభిమానుల్లోనూ భారీ హైప్ క్రియేట్ చేస్తోంది.

# వారాణాసిలో మరో బాలీవుడ్ నటి ?




మహేష్ బాబు హీరోగా రూ. 1300 కోట్ల భారీ బ్జడెట్‌తో తెర కెక్కుతున్న అడ్వెంచర్ ఎపిక్ ’వా రణాసి’. ఈ చిత్రాన్ని రాజవౌళి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఐమ్యా క్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం అం దిస్తున్న ఈ సినిమాలో పృథ్వీ రాజ్ సుకుమారన్ విలన్‌గా నటిస్తుండగా, ఆర్. మాధవన్ కూడా ఒక కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇక ఈ మూవీ పై రోజుకో ఆసక్తికర వార్త బయ టకు వస్తోంది. ప్రస్తుతం హైదరా బాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో వేసిన భారీ వారణాసి సెట్‌లో మహేష్ బాబు (రుద్ర), ప్రియాంక చోప్రా (మందాకిని)లపై కీలక సన్నివేశాలను రాజవౌళి చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్ ముగియ గానే ఒక గ్రాండ్ సాంగ్ షూటింగ్ జరగనుందని, అందులో మహేష్ బాబు సరసన నటించేందుకు మరో బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌ను చిత్రబృందం సంప్రదించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రియాంక చోప్రా తన పాత్ర కోసం ఒక అదిరిపోయే డ్యాన్స్ నెంబర్ ఉండాలని కోరగా, ఈ స్పెషల్ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. ఇక హాలీవుడ్ స్థాయి విజువల్స్ కోసం అంటార్కిటికా వంటి లొకేషన్లలో కూడా షూటింగ్ జరిపిన జక్కన్న, ఈ స్పెషల్ సాంగ్‌ను విజువల్ వండర్‌గా తీర్చిదిద్దబోతున్నారట. , 2027న ఉగాది కానుకగా విడుదల కాబోతున్న ఈ చిత్రం, భారతీయ సినిమా చరిత్రలో సరికొత్త రికార్డులను సృష్టించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# సినిమా




## ఇదేం పాట? నోరా ఫతేహికి మహిళా కమిషన్ చివరి అవకాశం



నటి నోరా ఫతేహి, నటుడు సంజయ్ దత్ నటించిన ‘సర్కే చునార్ తేరి’ పాట వివాదంపై జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. సుమోటోగా కేసు నమోదు చేసుకున్న కమిషన్, విచారణ చేపట్టింది. ఈ విచారణకు గేయ రచయిత రకీబ్ ఆలం, దర్శకుడు ప్రేమ్, కేవీఎన్ ప్రొడక్షన్స్ ప్రతినిధులు హాజరై, తమ తప్పును అంగీకరిస్తూ లిఖితపూర్వకంగా క్షమాపణలు తెలిపారు. కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ అధ్యక్షతన జరిగిన ఈ విచారణలో, పాటలోని సాహిత్యం మహిళల గౌరవానికి భంగం కలిగించేలా ఉందని ఆమె తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పాటకు అర్థం తెలియదని చెప్పడం సరికాదని అన్నారు.

సృజనాత్మకత పేరుతో మహిళల గౌరవాన్ని కించపరచడం సరికాదని, భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం చేయవద్దని చిత్ర బృందానికి గట్టిగా హెచ్చరించారు. దీనిపై స్పందించిన వారు, సమాజంలో తప్పుడు సంకేతాలు పంపినందుకు క్షమాపణలు చెబుతూ.. రాబోయే 3 నెలల్లో మహిళా సాధికారత కోసం పనిచేసి, నివేదిక సమర్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ విచారణలో నటి నోరా ఫతేహి తరఫున ఆమె న్యాయవాది హాజరుకాగా, కమిషన్ దానిని అంగీకరించలేదు. ఏప్రిల్ 27న ఆమె వ్యక్తిగతంగా హాజరు కావడానికి చివరి అవకాశం కల్పించింది. వృత్తిపరమైన కారణాలతో విదేశాల్లో ఉన్నానని తెలిపిన నటుడు సంజయ్ దత్‌ను ఏప్రిల్ 8న తప్పనిసరిగా కమిషన్ ముందు హాజరుకావాలని ఆదేశించింది. ‘కేడీ: ది డెవిల్’ సినిమాలోని ఈ పాట, అసభ్యకరమైన సాహిత్యం, కొరియోగ్రఫీ కారణంగా విడుదలైన వెంటనే తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. గాయకుడు అర్మాన్ మలిక్‌తో సహా పలువురు దీనిపై విరుచుకుపడ్డారు. వివాదం ముదరడంతో, మేకర్స్ ఈ పాటను యూట్యూబ్ నుంచి తొలగించారు.

## సినిమాల్లోకి దేవయాని కూతురు.. తెలుగు ‘కోర్టు’ రీమేక్‌తో ఎంట్రీ!



ఒకప్పటి ప్రముఖ నటి దేవయాని వారసురాలు సినీ రంగ ప్రవేశం చేస్తున్నారు. ఆమె చిన్న కుమార్తె ప్రియాంక రాజ్ కుమారన్ నటిగా తన ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారు. విశేషమేమిటంటే.. ఆమె తొలి చిత్రం 2024లో తెలుగులో వచ్చిన ‘కోర్టు’ సినిమాకు తమిళ రీమేక్ కావడం. పోక్సో చట్టంపై అవగాహన కల్పించే సామాజిక సందేశంతో ఈ చిత్రం రూపొందుతోంది. తెలుగు సినిమా ‘కోర్టు’ ఆధారంగా తమిళంలో ‘రంజన్: ది అడ్వకేట్’ పేరుతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు త్యాగరాజన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, ఆయన కుమారుడు జీన్స్ ప్రశాంత్ కథానాయకుడిగా నటిస్తున్నారు. తెలుగు మాతృకలో శ్రీదేవి పోషించిన కథానాయిక పాత్రను ప్రియాంక పోషించనుంది.

ఈ సినిమా ప్రారంభోత్సవం సోమవారం చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ చిత్రంతోనే నిర్మాత ఎస్. కదిరేశన్ కుమారుడు హరి కూడా నటుడిగా పరిచయం అవుతుండటం గమనార్హం. తెలుగులో హర్ష్ రోషన్ పోషించిన పాత్రను హరి చేయనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన దేవయాని, తన కుమార్తెను చిత్ర పరిశ్రమకు పరిచయం చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. తన కూతురు తప్పకుండా రాణిస్తుందన్న నమ్మకాన్ని ఆమె వెలిబుచ్చారు. ఈ వేడుకకు నటుడు విశాల్, దర్శకుడు వెట్రిమారన్ వంటి ప్రముఖులు హాజరయ్యారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది.

## అట్లీ, అల్లు అర్జున్ మూవీ పోస్టర్ విడుదల



అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. ’ఎఎ22ఎక్స్ 6’గా ఇది ప్రచారంలో ఉంది. తాజాగా దీనికి సంబంధించిన అప్‌డేట్‌ను చిత్రబృందం పంచుకుంది. అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం దీని టైటిల్‌ను ప్రకటించనున్నట్లు వెల్లడించింది. ఈ విషయాన్ని తెలుపుతూ టీమ్ పంచుకున్న పోస్టర్ అందరిలో ఆసక్తి కలిగించింది.

సాధారణంగా టైటిల్ ప్రకటన అంటే హీరో లుక్‌కు సంబంధించిన పోస్టర్‌ను పంచుకుంటారు. కానీ టీమ్ మాత్రం జంతువు పంజా ఉన్న పోస్టర్‌ను షేర్ చేసింది. దీంతో ఈ సినిమా థీమ్‌పై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. అట్లీ ఏం ప్లాన్ చేస్తున్నారంటూ కామెంట్స్ చేస్తున్నారు. పునర్జన్మల కాన్సెప్ట్‌తో ముడిపడి ఉండే సైన్స్‌ఫిక్షన్ మూవీగా ఇది ముస్తాబవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215